MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 7 రంగారెడ్డి మార్చి 2022 పేజీలు : 36 వెల : రూ. 10/-



బైంసాలో ' వాష్ ' సి ఆర్ పి ల సమీక్షా సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి





ఇవి గిజిగాడి గూళ్ళు అనుకుంటున్నారా? కావు ... మామిడి కాయలు నాణ్యంగా వుండడానికి రక్షణగా తొడిగిన కవర్లు !

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు !

## ఏపిమాస్ నూతన ఒప్పందాలు !




ఎస్ బి ఐ ... తెలంగాణాతో ...



ఏకలవ్య ఫౌండేషన్‌తో ...






బీహార్‌లో ఎఫ్ పి ఓలకు ... ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో వరంగల్లు ఎఫ్ పి ఓ సి ఇ ఓలకు శిక్షణలు

PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
మరుగుదొడ్డి ఉపయోగించడం వల్ల మీకు కలిగే ప్రయోజనాలు:
• మీ ఇంటిలో పరిశుభ్రత ఉంటుంది • వివిధ జబ్బులకు దూరంగా ఉంటారు
• ఆరోగ్యకరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది
• పరిశుభ్రంగా ఉంటారు మరియు కరోనాను దూరంగా పారదోలతారు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 7



సంపాదకీయం

## ప్రోత్సాహకాలు

**'కృ**షితో నాస్తి దుర్భిక్షం' అనే స్ఫూర్తి వాక్యం నిత్యసత్యం. 'కష్టే ఫలి' ... కష్టపడితే తప్పక ఫలితం వుంటుందని ఆ స్ఫూర్తి వాక్యానికి అర్థం. ఒక్కొక్కసారి వెంటనే ఫలితం కనిపించకపోవచ్చు. కాని, సత్సంకల్పంతో, సరైన మార్గంలో , తగిన సాధన సంపత్తితో, ఆనుపానులను గమనిస్తూ, అనువైన రీతిలో కృషిచేస్తే ఆశించిన ఫలితం ఆలస్యంగానైనా దక్కకపోదు. ఈ వాస్తవం ఎప్పటికప్పుడు రుజువవుతూనే వుంది. కర్ణాటక గ్రామీణ రైతు మహాలింగ నాయక్ ఆ నిత్యసత్యాన్ని మరోసారి నిరూపించి తన అమోఘ కృషికి 'పద్మశ్రీ ' పురస్కారాన్ని పొందిన వార్తావిశేషాన్ని ఈ సంచికలోనే చూడవచ్చు. మహా లింగ నాయక్ మొదట రైతు కూలీ. అంకితభావంతో తానుచేసిన వ్యవసాయపు పనులకు మెచ్చి అతని యజమాని రెండెకరాల కొండపొలం యిచ్చాడు. మహాలింగ నాయక్ కొండకు సొరంగంచేసి తన పొలానికి నీటి వసతి ఏర్పాటుచేసుకోవాలని ఎనిమిదేళ్ళపాటు ఒకటి విఫలమైతే మరొకటిగా ఏడు సొరంగాలు తవ్వాడు. చిట్టచివరకు సెలయేటిని ఒడిసి పట్టుకోగలిగాడు. కొండను తవ్వి నీటిని సాధించిన ఆ అపర భగీరథుడు మనకందరికి స్ఫూర్తిదాయకుడు, ఆదర్శప్రాయుడు. అంతగా అనుకూలం కాని పరిస్థితులలో, ఒంటరి పోరాటంతో (కేవలం తన భార్య సహాయంతో) అతడు ఇంత సాధిస్తే , పరిస్థితులు చాలావరకు అనుకూలంగా, ప్రోత్సాహకరంగా వుండి, పైపెచ్చు సంఘటితంగా ముందడుగు వేస్తున్న  మన రైతులు ఇంకెంత సాధించాలి? కావలసింది ఆత్మవిశ్వాసం, అవసరానికి అనుగుణంగా ఎదగడం, పరిస్థితులను అనుకూలంగా మలచుకోగలగడం, అందుబాటులోవున్న వనరులను, వసతులను, పథకాలను, ప్రోత్సాహకాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవడం. నిజానికి రైతు పరిస్థితి గతంతో పోలిస్తే యిప్పుడు కొంత మెరుగుగానే వుంది. ప్రపంచవ్యాప్తంగా ఎఫ్ పి ఓ ల ఏర్పాటు ఎంతో ప్రాధాన్యంసంతరించుకున్నది. రైతులను సంఘటితపరచడంకోసం, రైతు ఆదాయం పెంచడంకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నెన్నో ఫథకాలను ప్రకటిస్తున్నాయి. తోడ్పాటు అందిస్తున్నాయి. ఇటు ఏపిమాస్ , తదితర అనేక స్వచ్ఛంద సంస్థలు రైతులకు వ్యవసాయానికి, మార్కెటింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, మార్గదర్శకత్వం వహిస్తున్నాయి. ముందే చెప్పినట్టు చేయవలసింది ఈ అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడమే. రసాయనిక వ్యవసాయాన్ని నిరుత్సాహ పరచి, సహజ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కేంద్రప్రభుత్వం సంకల్పించినట్టు ఇటీవలి బడ్జెట్ ప్రసంగంలో ఆర్ధికమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పాఠశాలలలో పాఠ్యాంశంగా కూడా సేంద్రియ వ్యవసాయానికి ప్రాముఖ్యం యివ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. జిల్లావారీగా ఏయే పంటలు పండించడం మంచిదో సూచించిన ప్రభుత్వం,ఆ వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు అవసరమైన పరిశ్రమల ఏర్పాటును కూడా ప్రోత్సహిస్తున్నది. ఇంతే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రతి రైల్వే స్టేషన్ పరిధిలో ఒక్కొక్క ఉత్పత్తికి ప్రోత్సాహం, ప్రచారం కల్పించాలనికూడా కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. పథకాల ప్రకటనకు, అవి కార్యరూపందాల్చడానికి పొంతన వుంటుందా అనే అనుమానం సహజమే అయినప్పటికి, ఇవన్నీ ఎంతో కొంత సానుకూల సంకేతాలనే విషయం కాదనలేం. ఉభయ తెలుగు రాష్ట్రప్రభుత్వాలు కూడా ఎఫ్ పిఓ లను ప్రోత్సహించడానికి సుముఖంగా ఉన్నాయి. ఉద్యాన ఉత్పత్తుల సేకరణను ఎఫ్ పి ఓలకు అప్పగించడం వంటి కార్యక్రమాలు యిప్పటికే ప్రారంభం కావడం సంతోషించవలసిన విషయం. వున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు కొత్త అవకాశాలను వెదికి పట్టుకోవడం అభివృద్ధి చెందాలనుకునే వారి లక్షణం. రైతులతో కలసి పనిచేస్తూ, వారిని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎన్నెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న ఏపిమాస్ ఈ దిశగా ఎంతో ప్రయోజనదాయకమైన శిక్షణలను, అవగాహన పర్యటనలను నిర్వహిస్తూ మార్గదర్శనం చేస్తున్నది. ఎఫ్ పి ఓలు  ఎంతగా బలోపేతమైతే రైతులకు అంతగా ఫలితాలు అందుతాయి. సంస్థను రైతు బలపరిస్తే, సంస్థ రైతును బలపరుస్తుంది. ఎంతమంది రైతులు సభ్యులుగా చేరితే, సంస్థ అంతగా బలపడుతుంది. సంస్థ ఎంత బలపడితే అంతగా రైతులకు మేలు జరుగుతుంది. ఈ ఉభయతారకమైన విషయాన్ని గ్రహించి నడచుకుంటే రైతు రాజే !

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

ఇతరులు నిన్ను అర్థం చేసుకోలేదని బాధపడడం కాదు, ముందుగా నిన్ను నీవు అర్థంచేసుకో

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఎఫ్‌పిఓలు ...05
- పంటకు రక్షణగా సోలార్ దీపపు ఎర ! ...07
- నల్లమడలో వ్యవసాయ క్షేత్ర దినోత్సవం ...09
- జై కిసాన్ సొసైటి ఆధ్వర్యంలో పొలంబడి ...10
- బంగారు భవిష్యత్తుకోసం లైంగిక సమానత్వం ...11
- సమానత్వసాధన దిశగా నూత్న సందేశం! ...13
- మిన్నల్లి పనిపట్టే వై.ఎన్. ద్రావణం ! ...14
- విత్తన హక్కుల పోరాటంలో రైతు విజయం ...15
- రైతులను ముంచిన 'జాదూ' పత్తి విత్తనాలు ! ...17
- తక్కువ ఖర్చుతో పండుఈగల నివారణ! ...18
- ఏడు సొరంగాలు తవ్వి ... నీళ్ళు తెచ్చాడు! ...20
- వరంగల్లు ఎఫ్ పి ఓ ల సి ఇ ఓ లకు శిక్షణ ...22
- తేనెటీగల పెంపకంతో ఉపాధి బాటలో... ...23
- శాకాహారపు మాంసం కూర 'చక్రవర్తి'! ...24
- తెలంగాణ నేలపై విరగకాసిన రుద్రాక్ష ! ...25
- ఎఫ్ పి ఓల ద్వారా ఉద్యాన ఉత్పత్తుల సేకరణ ...26
- రసాయన రహిత వ్యవసాయానికి ప్రోత్సాహం ...27
- అభాగినులకు అండగా యోగిత పోరాటం! ...28
- కరెంటు అక్కర్లేని కూరగాయల మొబైల్ కూలర్! ...29
- రైతు కంట కన్నీరుపెట్టిస్తున్న కంది పంట ...30
- ప్రకాశం జిల్లాలో చేపల చెరువుల చెలగాటం ...31
- చేపల పెంపకం ... కొన్ని సూచనలు ... ...32
- పశువులకు గడ్డితోపాటు పౌష్టికాహారం! ...33
- ఆంధ్ర మహిళల అసామాన్య స్వాతంత్ర్య స్ఫూర్తి ...34


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

**అతిగా ఆలోచించడమే అంతులేని అసంతృప్తికి, ఆందోళనకు మూలం**

# ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఎఫ్ పి ఓలు

– ఎస్. ప్రహల్లాద

**భా**రత దేశ ఆర్థికాభివృద్ధిలో వివిధ రకాల సంఘాలు ప్రముఖ భూమిక పోషిస్తున్నవనడం లో అతిశయోక్తి లేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అవసరాన్ని బట్టి అనేక రకాల సంఘాలు ఏర్పాటవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 'రైతు ఉత్పత్తిదారుల సంస్థలు' (ఎఫ్ పి ఓలు) ఈమధ్య కాలంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నవి.

ఇప్పటికే వివిధ అవసరాలను బట్టి అనేక పేర్లతో వున్న రైతు సంఘాలు (రైతుమిత్ర సంఘాలు, రైతు గ్రూపులు, రైతు సమిష్టి అవసరాల సంఘాలు, ఉమ్మడి అవసరాల సంఘాలు, ఉమ్మడి నీటి అవసరాల సంఘాలు, వన సంరక్షణ



సమితులు మొదలగునవి) ఎన్నో కార్యక్రమాలను చేపడు తున్నాయి. వివిధ రకాలుగా వున్న రైతు సంఘాల కార్యక్రమాలను విశ్లేషించిన తరువాత రైతులకు అన్ని రకాల సేవలను ఒకే చోటినుంచి అందించే సంస్థలుగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

దేశంలో ఇప్పటికే వేల సంఖ్యలో రైతు ఉత్పత్తిదారు సంఘాలు వుండగా మరో 10 వేల సంఘాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.

**విజయవంతంగా ఎఫ్ పి ఓలు**

రైతు ఉత్పత్తిదారు సంస్థలలో అధికముగా చిన్న, సన్నకారు రైతులు సభ్యులుగా వుంటారు. ఈ రైతులు తమకు కావలసిన వ్యవసాయ పరికరాలు, పనిముట్లు స్వంతంగా కొనుక్కోలేరు. మరోవైపు అవగాహన లేకపోవడం వలన నూతన వ్యవసాయ పద్ధతులను కొంతమంది రైతులు అందిపుచ్చుకోలేక పోతున్నారు.

ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు వివిధ స్వచ్ఛంద సంస్థలు అనేక రైతు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయుచున్నప్పటికిని ఇంకా చాలామంది రైతులు ఆ కార్య క్రమాల వల్ల ప్రయోజనం పొందడానికి సరియైన చొరవ చూపలేకపోతున్నారు. అందువలన రైతులలో "సామాజిక ఒత్తిడి" ని పెంచి తద్వారా వారిలోని చొరవలను మరియు సృజనాత్మక శక్తిని వెలికితీసి రైతులు అభివృద్ధి పయనంలో నడిపించుటకు ఈ రైతు ఉత్పత్తిదారుల సంస్థలు చాలా ఉపయోగపడుతున్నవనడంలో అతిశయోక్తి లేదు.

ఇంతేగాక వివిధ అభివృద్ధి పథకాలు రైతు ఉత్పత్తిదారు సంస్థల ద్వారా అమలు చేసినట్లయితే వాటిని రైతులు సమర్థవంతంగా ఉపయోగించుకుంటారని ప్రభుత్వం భావించి రైతు ఉత్పత్తిదారు సంస్థల ద్వారానే అమలు చేసే విధంగా పథకాల నియమాలు కూడా రూపొందించడం జరిగింది.

**పుంగనూరు ఎఫ్ పి ఓ**

కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎన్.సి.డి.సి. (సి.బి.బి.ఓ) వారి ద్వారా ఏపిమాస్ సంస్థ చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలంలో శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేసినది. ఈ సంస్థను 1995 సహకార సంఘాల చట్టం క్రింది నమోదు చేయడం జరిగింది.

రైతులకు వివిధ రకాల సేవలను అందించే వ్యూహంలో భాగంగా ఏపిమాస్ క్షేత్ర స్థాయి సిబ్బంది మండలంలో రైతుకు తోడ్పాటు అందించే వివిధ ప్రభుత్వ విభాగాలను

(ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, పశు సంవర్ధకశాఖ మొదలగునవి) సమన్వయం చేసుకుంటూ వివిధ రకాల సేవలకు అంకురార్పణ చేయడం జరిగింది. ప్రతి ప్రభుత్వ విభాగం కూడా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహంచి వారి ద్వారానే వివిధ పథకాలు అమలు చేయడం జరుగుతున్నది.

పుంగనూరు మండలంలోని శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తిదారుల సంస్థ చేపట్టవలసిన కార్యక్రమాల రూపకల్పనలో భాగంగా ఏపిమాస్ ప్రాజెక్ట్ సిబ్బంది మండలంలోని ఉద్యానశాఖ అధికారి శ్రీమతి లక్ష్మి ప్రసన్న గారితో చర్చించడం జరిగింది. శ్రీమతి లక్ష్మి ప్రసన్న గారు అనేక సలహాలు ఇవ్వడం, ఎఫ్ పి ఓలకు ప్రభుత్వం అందించే వివిధ రకాల కార్యక్రమాల గురించి తెలియజేయడంతో పాటు




వాటి క్షేత్ర స్థాయి సిబ్బందిని కూడా రైతు ఉత్పత్తిదారు సంస్థల ఏర్పాటులో భాగస్వాములు కావాలని కూడా కోరారు.

**ఎఫ్ పి ఓలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

శ్రీమతి లక్ష్మి ప్రసన్న గారు తెలియజేసిన ప్రకారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు క్రింది విధంగా వున్నాయి.

గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు స్థానికంగానే వివిధ రకాల సేవలు అందించాలన్న దృఢసంకల్పంతో పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "గ్రామ సచివాలయ వ్యవస్థను" అమలు చేయుచున్నది. ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రతి పంచాయతికి ఒకటి చొప్పున "రైతు పనిముట్ల అద్దె కేంద్రాన్ని కేటాయించి వాటిని అమలు చేయుటకొరకు "రైతు ఉత్పత్తిదారుల సంత లను" ప్రోత్సహించుచున్నది. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రానికి ఒక గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించి వారి ద్వారా పంచాయతి పరిధిలోని రైతులకు సేవలు అందేలా చూస్తున్నది.

- ఐ ఎఫ్ ఎ డి వారి నిధులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంపిక చేసిన మండలాలలో ప్రయోగాత్మకంగా అమలు పరచిన "కరువు ఉపశమన పథకము" పల్లె జీవంలో కూడా రైతు ఉత్పత్తిదారు సంస్థలే కీలక పాత్ర పోషిస్తున్నాయి.
- ఉద్యానశాఖ వారు అమలుపరిచే (ఏ పి ఐ ఐ ఎ టి పి) పథకంలో కూడా రైతు ఉత్పత్తిదారు సంస్థలే కీలక పాత్ర పోషించుచున్నవి. వారు అనేక ప్రయోజనాలు పొందుతారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అనేక ప్రభుత్వ పథకాలు అనగా శీతల గిడ్డంగులు, కూరగాయల సేకరణ కేంద్రాలు విజయవంతంగా పని చేస్తున్నాయి.
- ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారు సంస్థలను ప్రోత్సహించు టకు 75% సబ్సిడీతో వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టుచున్నవి. వ్యక్తిగతంగా అయితే రైతుకు కేవలం 35% లేదా 40% సబ్సిడీ మాత్రమే లభిస్తుంది.
- అనేక కార్పోరేట్ మార్కెటింగ్ సంస్థలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడానికి ముందుకు వస్తున్నాయి.
- శీతల గిడ్డంగులను ఏర్పాటుచేసుకొని సభ్య రైతులు ఉపయోగించుకుంటున్నారు.
- రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రైతుల సంఘటిత శక్తి పెరిగి మంచి ధరలను కూడా పొందగలుగుతారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎఫ్ పి ఓలు మంచి సాధనాలనే వాస్తవాన్ని అధికారులందరూ గుర్తించి వాటిని ప్రోత్సహిస్తారని ఆశిద్దాం. ■

**పొరపాటు చేశావా? ఒప్పుకో, ఫలితమెలా వుంటుందో తెలుసుకో, మళ్ళీ ఆ పొరపాటు చేయకు**

# పంటకు రక్షణగా సోలార్ దీపపు ఎర !

– తప్పెట రమేష్ రెడ్డి

**భా**రతదేశము వ్యవసాయ ఆధారిత దేశము. ముఖ్యముగా రైతులు అధిక దిగుబడి కోసం అనేక విధానాలు పాటిస్తూ ఉంటారు. పంటలను నాశనం చేసే కీటకాలను నిర్మూలించేందుకు రైతులు రసాయనిక ఎరువులును, పురుగు మందులను ఎక్కువుగా వినియోగిస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రజల రసాయనిక మందులు వాడిన పంట దిగుబడులను తినాల్సి వస్తుంది.



ఈ క్రమంలో రైతులకు నష్టాన్ని తగ్గించేందుకు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నూతనంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు సోలార్ దీపపు ఎరలను కనుగొన్నారు. పంట చేనులో పైరును నష్టపరిచే పురుగుల ఉధృతిని అంచనా వేసేందుకు రైతులు పొలాల్లో విద్యుత్ బల్బులతో కూడిన దీపపు ఎరలు ఏర్పాటు చేస్తారు. ఎరలో చిక్కిన పురుగుల సంఖ్య అధారంగా తగు సస్యరక్షణ చేపడుతుంటారు. విద్యుత్ అవసరం లేకుండా కేవలము సూర్యకాంతి ఆధారంగా స్వయంగా ఇంధనము సమకూర్చుకొని పని చేసే సోలార్ దీపపు ఎరలు అందుబాటులోకి వచ్చాయి. పగటి పూట సూర్యరశ్మిని ఇంధనంగా మార్చుకొని సోలార్ ప్లేట్ దీపపు స్టాండ్ బిగించి ఉంటుంది. పండ్ల తోటలు, కూరగాయలు, తోటలు, పూల తోటలు, ప్రత్తి అన్ని రకాలు పంటలకు పురుగు నివారణకు ఉపయోగపడుతుంది. బాటరీ పూర్తిగా ఛార్జ్ అవ్వగానే చీకటి పడినప్పుడు మొదలయి ఉదయం సూర్యకిరణాలు పడగానే దానంతట అదే లైట్ ఆగిపోయి బ్యాటరీ ఛార్జ్ అవుతుంది.

**రైతు అనుభవాలు వారి మాటల్లోనే ...**

మాది చిత్తూర్ జిల్లాలోని కలికిరి మండలంలోని బత్తినవారిపల్లి గ్రామం, నా పేరు బి.మల్లికార్జున. మా టమాట పొలములో జిఐసి ప్రాజెక్టులో భాగంగా కలికిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ తరుపున డెమో చేయడం జరిగింది. మా టమాట పొలంలో పూత, పిందె సమయంలో ఈ సోలార్ దీపపు ఎరని 20 రోజులపాటు అమర్చాము.

మొదటి మూడు రోజులలోనే రెక్కల పురుగులతో, దోమలతో ఎరల తొట్టె నిండిపోయింది. ఈవిధంగా నీరు మారుస్తూ పరిశీలించాము. క్రమేణా పంటను నష్టము చేయు ఉజీ ఈగ, పండు ఈగ ఉధృతి చాలావరకు తగ్గిపోయి ఆరోగ్యకర మైన దిగుబడి పొందాను. ఎప్పుడూ సుమారు 50,000/– రూపాయలు వరకు ఖరీదు చేసే పురుగు మందులు పిచికారి చేసేవాడిని. ఈసారి కేవలము 18,000 రూపాయలు ఖర్చు మాత్రమే రెండు ఎకరాల టమాట పంటకి పిచికారి చేశాను.

దీని ఉపయోగాన్ని చుట్టుపక్కల ఊర్ల రైతులకు చూపించి పని విధానం ఉపయోగము ఏపిమాస్ ద్వారా తెలియచేశాము. వారితో పాటుగా కొంతమంది రైతులు కలికిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ నుండి కొని వాడుతూ పంట పెట్టుబడిని తగ్గించి అధిక దిగుబడిని పొందుతున్నారు.

పరికరాలు : 1. సపోర్ట్ స్టాండ్ 2. బౌల్ ఎర రపు స్టాండ్ 3.సోలార్ పానెల్‌తో కలిపిన బల్బ్ 4. ఆఫ్ / ఆన్ బటన్.

**పనిచేయు విధానం**

- సోలార్ దీపపు ఎరను పొలములో అమర్చిన వెంటనే బటన్ ఆన్ చేసి పెట్టవలెను. ఈవిధంగా పెట్టినప్పుడు

చీకటి పడగానే బాటరీ మొదలయ్యి రాత్రంతా బ్లూ రంగు లైట్ వెలుగుతూ ఉంటుంది.

- ఎగిరే దోమలు, కాండము తొలుచు పురుగు, రసము పీల్చు పురుగులు, ప్రతి ఒక్క ఎగిరే పురుగులు రాత్రిపుట బ్లూ కలర్ లైట్‌కు ఆకర్షించబడి బౌల్‌లోని సర్ఫ్ నీటిలో పడి చనిపోవడము జరుగుతుంది.
- ఈవిధంగా పడిన పురుగులు ఎప్పటికప్పుడు నీటిని తొలగించి మారుస్తూ ఉండాలి. ఈ తొలగించిన పురుగులను భూమిలో పాతిపెట్టాలి.
- పంట మొదటి నుంచి ఈ సోలార్ దీపపు ఎరను అమర్చుకోవడం ద్వారా పొలములో పంట ఉధృతిని చాలావరకు నివారించవచ్చు.

**ఉపయోగాలు**

- ఈ సోలార్ దీపపు ఎరను రైతు ఎవరి సహాయము లేకుండా సులువుగా పొలములో అమర్చుకోవచ్చును.
- ఈ సోలార్ దీపపు ఎర ద్వారా అన్ని రకాల రెక్కల పురుగులు ఈ సోలార్ దీపపు ఎరలోని బ్లూ లైట్‌కి ఆకర్షించబడతాయి.
- ఈ సోలార్ దీపపు ఎరలో పడిన పురుగులను బట్టి మన పొలములో ఏరకమైన పురుగులు ఆశిస్తున్నాయో కనుగొని పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చును.
- ఈ పురుగు మందులు ఎకనామిక్ థ్రెషోల్డ్ లెవెల్ మించి ఉన్నపుడు మోతాదును నిర్ధారించుకొని పిచికారి చేయవచ్చును. దీని ద్వారా రైతులు పురుగు మందుకు పెట్టె పెట్టుబడి తగ్గించవచ్చును.
- మొదటి నించి పురుగు ఉధృతి తగ్గించడం వల్ల తెగుళ్ళ వ్యాప్తిని తెగుళ్ళ మందు పిచికారి కూడా తగ్గించవచ్చును.
- ముఖ్యముగా టమాట పంటలో చాలావరకు తెగుళ్ళు చీడపీడలు ఉధృతి తగ్గించి అధిక దిగుబడులు సాధించవచ్చును.
- ఈవిధంగా సాధించినటువంటి ఉత్పాదన కొన్నవారి ఆరోగ్యము కూడా తక్కువ మందులు వాడటము వలన కాపాడవచ్చు. ■

## ఫారమ్ - IV

'మహిళా సాధికారత' తెలుగు మాస పత్రిక యాజమాన్యం, ఇతర అంశాలకు సంబంధించిన ప్రకటన

------------------------------

1. ప్రచురణ కేంద్రం : హైదరాబాద్
2. ప్రచురణ కాల వ్యవధి : నెల (మాసపత్రిక)
3. ముద్రణకర్త పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి

   జాతీయత : భారతీయత

   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089
4. ప్రచురణకర్త పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి

   జాతీయత : భారతీయత

   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం,ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089
5. సంపాదకుని పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి

   జాతీయత : భారతీయత

   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం,ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089
6. పత్రిక యాజమాన్యంలో భాగస్వాములైన లేదా మొత్తం వాటా ధనంలో ఒక శాతానికి ---లేరు--- మించి వాటాదారులైన వ్యక్తుల పేర్లు, చిరునామాలు:

టి.చంద్రశేఖర్ రెడ్డి అనే నేను పైన పేర్కొన్న అంశాలన్నీ నాకు తెలిసినంతవరకు వాస్తవమని నమ్ముతూ ఇందు మూలముగా ప్రకటిస్తున్నాను.

తేదీ:01-03-2022 ప్రచురణకర్త సంతకం

ఆత్మవిశ్వాసం లేకుంటే అణువైనా కొండలా భయపెడుతుంది. అదే వుంటే కొండకూడా అణువే

# నల్లమడలో వ్యవసాయ క్షేత్ర దినోత్సవం

అనంతపురం జిల్లాలోని గుడిబండ, నల్లమాడ మండలాలలో ఏపిమాస్ సంస్థ ద్వారా 2019 సంవత్సరం నుండి క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టును రెండు పంచాయతీలలో అమలు చేయడం జరుగుతున్నది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ముఖ్యంగా 5 అంశాల మీద పని చేయడం జరుగుతున్నది.






స్మార్ట్ అగ్రికల్చర్, స్మార్ట్ న్యూట్రిషన్, స్మార్ట్ ఎనర్జీ, స్మార్ట్ ఇన్స్టిట్యూషన్ మరియు స్మార్ట్ నాలెడ్జ్ మీద పని చేయడం జరుగుతోంది. స్మార్ట్ అగ్రికల్చర్‌లో భాగంగా ఆదర్శ రైతు పొలాలలో ప్రతి నెల పొలంబడులు నిర్వహించడం జరుగుతున్నది. ఈ పొలంబడి కార్యక్రమంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ నేల దున్నుట మొదలు కోత, విత్తనం నిల్వ చేసేవరకు తీసుకోవలసిన తగు జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతున్నది.

పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహనలో భాగంగా దుక్కిలో ఘన జీవామృతం, విత్తనానికి ఇంగువ కషాయం లేదా బీజామృతం లేదా ట్రైకోడెర్మతో విత్తనశుద్ధి, పంటపై వేప నూనె, జీవామృతం, పంచగవ్య, పుల్లటి మజ్జిగ, పురుగు వికర్షణ ద్రావణాలపై అవగాహన కల్పించడం జరుగుతున్నది. గత రెండుసంవత్సరాలుగా రైతులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయం, సమీకృత వ్యవసాయంపై అందరికి అవగాహన కల్పించడంకొరకు మండల స్థాయిలో వ్యవసాయ క్షేత్ర దినోత్సవం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్షేత్ర దినోత్సవంకి మండల వ్యవసాయ అధికారి, మండల పశు విద్యాధికారి రైతులు మరియు ఆదర్శ రైతులు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో కొన్ని రకాల వ్యవసాయ పనిముట్లు, కషాయాలు, నవధాన్య విత్తనాలు, చిరుధాన్య విత్తనాలు స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో వ్యవసాయ అధికారి మరియు పశు వైద్యాధికారి మాట్లాడుతూ పూర్వ కాలం పంటలు పద్ధతులు, దేశీ విత్తనం, పాడి పంట మధ్య అనుబంధం, ఆరోగ్యం మరియు పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.

అనంతరం ఆదర్శ రైతులు మాట్లాడుతూ వారు పాటించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి వలన కలిగిన లాభాలు గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా ప్రతి రైతు కనీసం వారి ఇంటి సభ్యులు ఆరోగ్యం కోసం సేంద్రియంలో పెరటి తోటలు మరియు ఒక అర్ధ ఎకరా పొలంలో వివిధ రకాల చిరు ధాన్యాలు, పప్పు దినుసులు పండించు కొని ఆరోగ్యంగా వుండాలని తెలియ చేయడం జరిగింది.



ప్రాజెక్ట్ సిబ్బంది మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి మరియు కెమికల్ వ్యవసానికి మధ్య వ్యత్యాసం వివరిస్తూ ప్రకృతి వ్యవసాయంలో చేయడం వలన కలిగే లాభాల గురించి వివరించడం జరిగింది. సమావేశం అనంతరం స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన కషాయాలు తయారీ విధం, ఉపయోగాలు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు గురించి వివరించడం జరిగింది. ■

**తన తప్పు తెలుసుకొని, సరిదిద్దుకోడానికి త్రికరణశుద్ధిగా ప్రయత్నంచేసేవాడే వివేకవంతుడు**

# జై కిసాన్ సొసైటి ఆధ్వర్యంలో పొలంబడి

అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో ఏపిమాస్ సౌజన్యంతో 7గ్రామాల రైతులు కలసి 'జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాన్ని' (ఎఫ్ పి ఓను) ఏర్పాటు చేసుకుని, 300మంది సభ్యులతో పని చేస్తున్నది. ప్రతి నెల సమావేశాలు జరపడం, కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు, వ్యవసాయ పనిముట్లను సొసైటి సభ్యులకు అందుబాటులో ఉంచడం వంటి కార్యక్రమాలను, సేవలను ఈ ఎఫ్ పి ఓ నిర్వహిస్తున్నది.

**సభ్యులకు అవగాహన కార్యక్రమాలు**

ఆరు గ్రామాల రైతులతో, మహిళా రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి, రైతు సమస్యల గురించి చర్చించి,



వాటి నిర్మూలనకు జై కిసాన్ సొసైటి ఏర్పాటు చేయటం జరిగింది. దీనిలో సభ్యత్వం తీసుకోవాలనుకునే వారు 1100 రూపాయల సభ్యత్వ రుసుం చెల్లించవలసి వుంటుంది.

- సభ్యులందరిని ఒకే వేదికపై సమావేశపరచి, రైతు సంఘాల వల్ల ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయో వివరించటం జరిగింది.
- రైతులకు కావలసిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను సంఘం సభ్యులకు అందుబాటులో ఉంచుతున్నారు.
- పంటల సాగుపైన, పంట మార్పిడి మొదలగు విషయాల పైన శిక్షణల ద్వారా రైతులకు అవగాహన కల్పించి, దిగుబడులు పెంచే విధంగా చర్యలు చేపడుతున్నారు.
- రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలను ఎఫ్ పి ఓల ద్వారా సాధించవచ్చు.
- గ్రామాల వారీగా ప్రారంభ (ఎంట్రీ పాయింట్) కార్యక్రమాలు చేస్తూ, ఇంటి వద్ద ఖాళీ స్థలంలో కూరగాయలు సాగు చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తూ మహిళలను చైతన్య పరుస్తున్నారు.
- జై కిసాన్ సొసైటి ఆధ్వర్యంలో 'పొలంబడి' కార్యక్రమాలను ఏర్పాటు చేయటం; వరి, పత్తి సాగుకు సంబంధించి ప్రదర్శన క్షేత్రాలను (డెమో ప్లాట్‌లను) ఏర్పాటు చేయటం, పంటల గురించి తీసుకోవలసిన సస్యరక్షణ పద్ధతుల పైన అవగాహన కల్పించటం జరుగుతున్నది.
- జోగిపేట వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ గారు డెమో ప్లాట్ పర్యవేక్షణకు వచ్చారు. ఆమె సేంద్రియ వ్యవసాయం పైన రైతులకు అవగాహన కల్పించారు. డెమో ప్లాట్ ఏర్పాటు చేసిన 'జై కిసాన్' సంస్థకు కృతజ్ఞతలు చెప్పారు.
- వ్యవసాయ శాఖ సహకారంతో 'సీడ్ విలేజ్' గ్రామంగా రెడ్డి ఖనాపూర్ గ్రామాన్ని గుర్తించి, ఎంపికచేసిన 25



మంది రైతులకు కె ఎన్ ఎం 118 వెరైటి ఇవ్వటం జరిగింది.

**కస్టమ్స్ హైరింగ్ సెంటర్**

- ఏపిమాస్ సహకారంతో జై కిసాన్ సొసైటి ఆధ్వర్యంలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. మొత్తం 366 సభ్యులకు కొద్దిపాటి అద్దెతో వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేస్తున్నారు.

■

ఏది సరైందో ఆలోచించి అదే చేయాలి, సవరింపులు మొదలెడితే వక్ర మార్గం పట్టినట్టే

# బంగారు భవిష్యత్తుకోసం లైంగిక సమానత్వం

**మా**ర్చి 8 వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' జరుపుకుంటున్నాం. మహిళా దినోత్సవం వివిధ దేశాలలో వివిధ తేదీలుగా జరిగి చివరకు మార్చి 8 వ తేదీగా స్థిరపడింది. 1975 నుంచి ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తూ, ఏడాదికొక కార్యాచరణ ప్రణాళికను, స్ఫూర్తి సందేశాన్ని ప్రకటిస్తున్నది.

ఆ కోవలో 2022 సంవత్సరపు మహిళా దినోత్సవానికి ఐక్యరాజ్యసమితి ప్రకటించిన స్ఫూర్తి సందేశం 'రేపటి సుస్థిరాభివృద్ధికోసం నేడు స్త్రీ, పురుష సమానత్వం పాటిద్దాం' అనేది.




అసలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే ఏమిటో, అది ఎందుకు ఎలా జరుపుకోవాలో కూడా ఐక్యరాజ్య సమితి విశదీకరిస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం' అంటే 'సాధించిన ప్రగతిని సమీక్షించి, మార్పుకోసం నినదించి, తమ దేశాల, తమ సమాజాల చరిత్రలో సాహసంతో, దృఢ సంకల్పంతో సాధారణ మహిళలు నిర్వహించిన అసాధారణ కృత్యాలను సంబరంగా జరుపుకోవడం' అని ఐక్యరాజ్య సమితి నిర్వచించింది.

అన్ని రంగాలలో స్త్రీ, పురుష సమానత్వం, మహిళా సాధికారత అంతిమ గమ్యాలుగా ముందడుగు వేస్తున్న మహిళా ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తున్న ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం (యు ఎన్ విమెన్) ఉద్యమంలో స్ఫూర్తిని రగిలించడానికి, ప్రపంచంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆకళింపు చేసుకుని, మరింత పూనికతో, మరింత అవగాహనతో లక్ష్య సాధన దిశగా ఉద్యమ ప్రస్థానం కొనసాగించడానికి అనువుగా ప్రతి ఏటా ఒక నూత్న కార్యాచరణ విధానాన్ని, నినాదాన్ని ఉద్యమానికి అందిస్తున్నది.

**మహిళా దినోత్సవం మొదలైన తీరు...**

ప్రపంచ స్థాయిలో మహిళా ఉద్యమాలకు 110 సంవత్సరాలకు పైగా చరిత్ర వున్నది. 1909 ఫిబ్రవరి 28 వ తేదీన ఉత్తర అమెరికాలో మహిళలకు ఓటు హక్కు కోసం పిడికిలి బిగించిన మహిళా ప్రతిఘటన కాలక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి దారి తీసిన తొలి అడుగు. అయితే అది కేవలం ఉత్తర అమెరికాకే పరిమితమైంది. అనంతరం 1911 మార్చి 19న ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జెర్లాండ్ దేశాలు ఉద్యోగినులు, శ్రామిక మహిళల సమ్మెలతో, నిరసనలతో హోరెత్తిపోయాయి.

మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై ఆ రోజున జర్మనీకి చెందిన సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్, రష్యా విప్లవోద్యమ, మహిళా ఉద్యమ ప్రముఖురాలు అలెగ్జాండర్ కొలంతయ్ నేతృత్వంలో జర్మనీ, ఆస్ట్రియా, డెన్మార్క్, స్విట్జెర్లాండ్, ఇతర ఐరోపా దేశాల సోషలిస్ట్ మహిళలు పెద్ద సంఖ్యలో సమ్మెలు, పాదయాత్రలు జరిపారు. అప్పటినుంచి ప్రతి ఏటా మార్చి 19న మహిళా దినోత్సవాన్ని పాటిస్తూ వచ్చారు. క్రమంగా

**తాము ఎలా వున్నా ఇతరులను ఉత్తములుగా తీర్చిదిద్దకపోతే వారు నాయకులే కాదు**



ఉద్యోగినుల సమస్యలే కాకుండా శాంతియుత సహజీవనం, మహిళల హక్కులు కూడా ఈ ఉద్యమంలో భాగమైనాయి. 1915లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేయాలంటూ జెట్కిన్ స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఒక ప్రదర్శన నిర్వహించారు. యుద్ధానికి సంబంధించిన ఉభయ శిబిరాల మహిళలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

అనేక దేశాలలో ఒకే రోజున ఉద్యమించిన మహిళల చైతన్య శక్తికి, సంఘటిత కార్యాచరణకు సంకేతంగా 1911 మార్చి 19వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గణుతికెక్కింది.

**గద్దె దిగిన చక్రవర్తి**

ఇక ఇప్పటి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి తొలి మెట్టుగా అత్యంత ప్రసిద్ధమైనది 1917 మార్చి 8న రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ లో ఆహారం, శాంతి కోసం రష్యన్ మహిళలు జరిపిన మహా ప్రదర్శన! జెట్కిన్, కొలంతాయ్ లు ఇరువురూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సమ్మె ఆ నగర మంతటా ఐదురోజులపాటు అల్లర్లకు, దాడులకు దారితీసింది. ఈ అల్లర్ల పర్యవసానంగా రష్యా చక్రవర్తి జార్ నికొలస్-2 పదవి నుంచి వైదొలగాడు. ఈ విధంగా నాటి మహిళా మహోద్యమం ఒక చక్రవర్తిని పదవీచ్యుతుని చేసి, 'ఫిబ్రవరి విప్లవం' గా చరిత్రలో నిలిచిపోయింది. (1917 వరకు రష్యా జూలియన్ క్యాలెండర్‌ను అనుసరించేది. ఆ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమం జరిగింది ఫిబ్రవరి 24-28 తేదీలలో. అందుకే అది ఫిబ్రవరి విప్లవమని పేరు పొందింది.

1918 నుంచి రష్యాలో ప్రస్తుతం అనుసరిస్తున్న గ్రెగేరియన్ క్యాలెండర్ వాడుకలోకి వచ్చింది. గ్రెగేరియన్ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమ తేదీలు మార్చి 8-12 అవుతాయి.

ఆ తర్వాత లెనిన్ నాయకత్వంలో రష్యాలో ఏర్పడిన తొలి సోవియెట్ ప్రభుత్వంలో కొలంతాయ్ మంత్రి అయ్యారు. ఆమె పట్టుపట్టి 'మహిళల మహా పోరాటానికి గుర్తు' గా మార్చి 8వ తేదీని అధికార సెలవుదినంగా ప్రకటింపజేశారు 1975 నుంచి ఐక్యరాజ్య సమితి ఈ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నది. ■

## బాబాలకు దానం చేయడానికి అమ్మాయి ఆస్తి కాదు

**బా**బాలకు, స్వామీజీలకు దానం చేయడానికి అమ్మాయి ఆస్తి (ప్రాపర్టీ) కాదని ముంబై హైకోర్టుకు చెందిన ఔరంగాబాద్ బెంచ్ వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని జల్నా జిల్లాలో 17 ఏళ్ళ ఓ బాలికను శంకేశ్వర్ ధక్నే అనే బాబాకు సదరు బాలిక తండ్రి దానంగా ఇచ్చాడు. ఈమేరకు 2018లో దానపత్రం పేరుతో బాబాకు స్టాంప్ పేపర్ మీద రాసిచ్చాడు. బాబా, ఆయన శిష్యుడు సోపన్ ధక్నే, బాలిక తండ్రి, బాలిక నలుగురూ బద్నాపూర్‌లోని దేవాలయంలో ఉండేవారు. బాబా, ఆయన శిష్యుడు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సదరు బాలిక 2021 ఆగస్టులో పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారిద్దరినీ అరెస్టు చేశారు. బెయిలు కోసం నిందితులు కోర్టును ఆశ్రయించారు. బాలికను దేవుడి సాక్షిగా కన్యాదానం చేస్తున్నట్టు ఆమె తండ్రి రాసిచ్చాడని బాబా కోర్టులో వాదించాడు. దీనిపై స్పందించిన కోర్టు... బాలిక తాను మైనర్‌నని ఫిర్యాదులో పేర్కొందని, రక్షణగా ఉండాల్సిన తండ్రి బాబాకు దానం చేయడమేంటని ప్రశ్నించింది. బాలికను దానం చేయడం చాలా కలచివేసే విషయమని పేర్కొంది. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఈ అంశాన్ని త్వరగా విచారించి బాలికకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని పరిశీలించాలని స్పష్టం చేసింది. ■

# సమానత్వ సాధన దిశగా ఏడాదికొక నూత్న సందేశం!

1975వ సంవత్సరం నుంచి ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికి ఏడాది కొక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించడం 1996 నుంచి మొదలైంది. అమెరికాలో 1910-20 సంవత్సరాలలో మహిళా దినోత్సవాన్ని జరుపుకునేవారు. ఆ తర్వాత నాలుగు దశాబ్దాల పాటు అమెరికాలో మహిళా దినోత్సవం జరగలేదు. తిరిగి 1960 దశకంలో మహిళా ఉద్యమంలో భాగంగా మహిళా దినోత్సవాన్ని పాటించినప్పటికి, సోషలిస్ట్ మహిళా సంఘాలకు అందులో పాత్ర వుండేది కాదు. 1975 నుంచి స్వయంగా ఐక్యరాజ్యసమితి మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పాటింపజేస్తున్నది. లక్ష్యసాధన దిశగా ఏడాదికి ఒక నినాదాన్ని, కార్యాచరణ పథాన్ని సమితి నిర్దేశిస్తున్నది. ఆ కార్యాచరణ ప్రణాళికామాలికను చూద్దాం!

1996: గతాన్ని గౌరవిస్తూ, భవిష్యత్తుకు ప్రణాళిక
1997: మహిళలు... శాంతి చర్చలు
1998: మహిళలు... మానవ హక్కులు
1999: మహిళలపట్ల హింసకు తావులేని ప్రపంచం
2000: శాంతికోసం మహిళలు ఏకంకావడం
2001: మహిళలు శాంతి, ఘర్షణలపై మహిళల అజమాయిషీ
2002: నేటి ఆఫ్ఘన్ మహిళ ... వాస్తవాలు, అవకాశాలు
2003: లైంగిక సమానత్వం ... సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు
2004: మహిళలు ... హెచ్ ఐ వి, ఎయిడ్స్
2005: 2005 సంవత్సరం తర్వాత లైంగిక సమానత్వం, భద్రత కలిగిన భవిష్యత్‌ను రూపొందించడం
2006: మహిళలు ... నిర్ణయాత్మక పాత్ర
2007: మహిళలపై హింసకు పాల్పడే వారిని శిక్షించక పోవడాన్ని తుదముట్టించాలి
2008: పెట్టుబడి వనరుగా మహిళలు, బాలికలు
2009: స్త్రీ పురుషులు ఏకమై మహిళలపైన, బాలికలపైన హింసను అరికట్టడం
2010: సమాన హక్కులు, సమానావకాశాలు, అందరి ప్రగతి
2011: విద్య, శిక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో సమానమైన అవకాశాలు ; మహిళలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పనకు మార్గ నిర్దేశం
2012: గ్రామీణ మహిళా సాధికారత ...పేదరికానికి, ఆకలికి తావులేకుండా చేయడం
2013: వాగ్దానం వాగ్దానమే ... ఇది మహిళలపై హింసను తుదముట్టించే కార్యాచరణకు సమయం
2014: మహిళలకు సమానత్వం అందరికీ ప్రగతి
2015: మహిళా సాధికారతే మానవాళి సాధికారత, సాధిద్దాం
2016: 2030నాటికి భూగోళం చెరిసగం(50-50): లైంగిక సమానత్వ సాధనకోసం ఆ దిశగా మరింత కృషి
2017: మారుతున్న పని ప్రపంచంలో మహిళ: 2030 నాటికి భూగోళం చెరిసగం (50-50)'
2018: ఇదే సమయం: గ్రామీణ, పట్టణ క్రియాశీల కార్యకర్తలు మహిళల జీవితాలలో మార్పు తెస్తున్నారు
2019: 'సమానంగా ఆలోచించు, చురుకుగా నిర్మించు, మార్పు కోసం వినూత్న మార్గాన్ని అనుసరించు'.
2020 : మహిళలు హక్కులను సాధించే సమానత్వ తరం!
2021: 'కోవిద్ -19 ప్రపంచంలో సమాన భవిష్యత్తును సాధిస్తున్న మహిళా నాయకత్వం'
2022: రేపటి సుస్థిరాభివృద్ధికోసం నేడు స్త్రీ, పురుష సమానత్వం పాటిద్దాం'

■

### ప్రపంచ మహిళా మహాసభలు !

- ➪ మొదటి ప్రపంచ మహిళా మహాసభ: 1975 (మెక్సికో)
- ➪ రెండవ ప్రపంచ మహిళా మహాసభ : 1980 (కోపెన్ హాగన్)
- ➪ మూడవప్రపంచ మహిళామహాసభ:1985 (నైరోబి)
- ➪ నాల్గవ ప్రపంచ మహిళామహాసభ:1995 (బీజింగ్) (నిజానికి కొన్ని అంతర్గత వైరుధ్యాల కారణంగా నాల్గవ ప్రపంచ మహిళామహాసభ పూర్తిగా సాగలేదు. ఐదవ మహాసభ అసలు చోటు చేసుకోలేదు.

దారి లేదని నిరాశ చెందకు, మూసుకున్నట్టు కనిపించే దారి ఒక మేలు మలుపు కావచ్చు

# మిన్నల్లి పనిపట్టే వై.ఎన్. ద్రావణం !

**మి**రప, బత్తాయి తదితర పంటలను ఆశిస్తూ అనేక రాష్ట్రాల్లో రైతులను బెంబేలెత్తిస్తున్న వెస్టర్న్ త్రిప్స్ లేదా నల్లపేను లేదా మిన్నల్లికి ఎర్రి పుచ్చకాయలు, నల్లేరు (వై. ఎన్.) ద్రావణం అద్భుతంగా పని చేస్తున్నదని వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం టి.వి. పల్లెకు చెందిన రైతు శాస్త్రవేత్త, 'వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' వ్యవస్థాపకులు కె. విజయ్‌కుమార్ తెలిపారు. గత ఆరేళ్ళుగా అన్ని రకాల పంటల్లో పురుగులు ఆశించకుండా నిలువరించడానికి,



ఆశించిన పురుగును అరికట్టేందుకు వై.ఎన్. ద్రావణాన్ని ఉపయోగిస్తున్నామని, ఇప్పుడు మిరప తదితర తోటలను ఆశిస్తున్న మిన్నల్లిని అరికట్టడంలో కూడా వై.ఎన్. ద్రావణం చక్కగా పని చేస్తున్నదని తెలిపారు. నిజానికి ఇది కొత్తదేమీ కాదని, చాలా ఏళ్లుగా ఉన్నదేనని ఆయన అంటున్నారు.

**వై.ఎన్. ద్రావణం తయారీ ఇలా ...**

5 కిలోల ఎర్రి పుచ్చకాయలు, 5 కిలోల ముదురు నల్లేరు కాడలు రెండింటిని మొత్తగా దంచాలి. వంద లీటర్ల నీరు కలిపిన ప్లాస్టిక్ డబ్బాలో పది రోజులు నిల్వ ఉంచి పంటలపై పిచికారీ చేసుకోవచ్చు. ఏడాది పాటు నిల్వ ఉంటుంది. నీడపట్టున ఉంచి పైన గోనె సంచి కప్పాలి. ఈ పసరు శరీరంపై పడితే విపరీతమైన దురద, దద్దుర్లు వస్తాయి. ముందు జాగ్రత్తగా చేతులకు తొడుగులు, ముక్కుకు శుభ్రమైన బట్టను కట్టుకోవాలి. పొరపాటున శరీరంపై పడితే పేడ రసం, బురద రాసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

**వరుసగా మూడు పిచికారీలు**

వై. ఎన్ ద్రావణాన్ని వివిధ పంటలపై పిచికారీ చేసి మంచి ఫలితాలు సాధించారు. ఇందులో ఉండే చేదు ప్రభావం, చర్మంపై పడగానే కలిగే దురదవల్ల పురుగులు చనిపోతాయి. గుడ్ల దశలో పిచికారీ చేస్తే పురుగు లార్వాలు మరణిస్తాయి. ఏ రకం పంటలయినా వై.ఎన్. ద్రావణాన్ని మూడు సార్లు పిచికారీ చేయాలి. రెండు పిచికారీల మధ్య 6 రోజుల ఎడం పాటించాలి. ఎకరాకు 15 ట్యాంకుల వరకు పిచికారీ చేస్తే పైరు బాగా తడిసి, ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తుంది. ఉదయం 6–9 గంటలు, సాయంత్రం 5.30–7.00 మధ్య పిచికారీచేయాలని ఆయన సూచించారు.

ఆకుకూరలను ఆశించే తెల్ల పేనుబంక, రంధ్రాలు చేసే మిడతలను వై. ఎన్. ద్రావణం నివారిస్తుంది. ఆకుకూరలపై మొదటిసారి ట్యాంకు (20లీ.)కు 1/2 లీటర్, రెండోసారి 1 లీటర్, మూడోసారి 1 1/2 లీటర్ చొప్పున ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి. కాయగూరలు వేరుశనగ, పత్తి, మిరప, వరి వంటి పైర్లు, పండ్ల తోటలపై మూడు దఫాలు వరుసగా 1లీటర్, 11/2లీటర్, 2 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలి. వేరు శనగను ఆశించే పచ్చపురుగు, నామాల పురుగు, కాండం తొలిచే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. వరిలో సుడిదోమ, కాండం తొలిచే పురుగును నివారిస్తుంది. పండ్ల తోటలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగించే వివిధ చీడపీడలను వై. ఎన్. ద్రావణం సమర్థవంతంగా నివారిస్తుంది.

మామిడిలో తేనెమంచు పురుగుపై ఇది చక్కని ఫలితాన్నిస్తుందని విజయకుమార్ తెలిపారు. చెట్లపై పూత దశకు ముందు, పిందె దశలో మాత్రమే బాగా తడిసేలా పిచికారీ చేయాలి. పూత మీద పిచికారీ చేస్తే రాలిపోతుంది. నిమ్మ, దానిమ్మ, బొప్పాయిల్లో వచ్చే మసితెగులు, ఆకుముడతను నివారిస్తుందని విజయకుమార్ (98496 48498) తెలిపారు. – (సాక్షి సౌజన్యంతో)

ఏ జీవికి లేని వరం నవ్వు - అది చీకటిని వెలిగించే వెన్నెల పువ్వు

# విత్తన హక్కుల పోరాటంలో రైతు విజయం

ప్రపంచం మొత్తంలో ఒక్క మన దేశ రైతులకు మాత్రమే విత్తనాలకు సంబంధించి విశిష్ట హక్కులు ఉన్నాయి. రైతులకు మేధోసంపత్తి హక్కు కల్పించడం కోసం మన పార్లమెంటు ప్రత్యేక చట్టంచేసి 20 ఏళ్లయ్యింది. విత్తనాలను ఇచ్చి పుచ్చుకోవడానికి సంబంధించి భారతీయ రైతులకున్న విశిష్ట హక్కుల చరిత్రలో మైలురాయి వంటి ఈ తీర్పు ఇటీవల వెలువడింది. బహుళజాతి కంపెనీలకు చెంప పెట్టులాంటి తీర్పు ఇది.

వేప, పసుపు, బాస్మతి బియ్యంపై అనాదిగా మన దేశానికి ఉన్న మేధో సంపత్తి హక్కుల తస్కరణకు గతంలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ప్రయత్నాలు జరిగాయి. వాటిని ప్రపంచ మేధో సంపత్తి హక్కుల సంస్థలో డా. వందనా శివ వంటి  ఉద్యమకారిణులు సమర్ధవంతంగా తిప్పికొట్టిన ఘనచరిత్ర మనకుంది. ఈ నేపథ్యంలో చట్టబద్ధ రైతాంగ విత్తన హక్కుల పరిరక్షణ కృషిలో తాజా తీర్పు గుజరాత్ రైతులకు సంబంధించిందే కానీ.. దేశంలో రైతులందరికీ గొప్ప విజయం అనటంలో సందేహం లేదు.

**గుజరాత్ రైతులపై పెప్సీ కేసులు**

గుజరాత్ బంగాళదుంప రైతులకు వ్యతిరేకంగా మేధో సంపత్తి హక్కుల ఉల్లంఘన కేసులు పెట్టిన బహుళ జాతి కంపెనీ 'పెప్సికో ఇండియా హెూల్డింగ్'కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. బంగాళదుంప వంగడంపై పెప్సికో కంపెనీకి గతంలో ఇచ్చిన మేధో సంపత్తి హక్కులను కేంద్ర వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న 'పంట వంగడాల పరిరక్షణ , రైతుల హక్కుల ప్రాధికార సంస్థ (పి.పి.వి.అండ్ ఎఫ్.ఆర్.ఎ.)' ఇటీవల రద్దు చేయటంతో రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇరవయ్యేళ్ల క్రితం పంట వంగడాల పరిరక్షణ , రైతుల హక్కుల చట్టం-2001 ప్రకారం పి.పి.వి. అండ్ ఎఫ్.ఆర్.ఎ. ఏర్పాటైంది.

విత్తన శాస్త్రవేత్తలు / కంపెనీలు రూపొందించే కొత్త వంగడాలతో పాటు.. రైతులు సంప్రదాయ విజ్ఞానంతో రూపొందించే కొత్త వంగడాలకు కూడా ఈ చట్టం మేధో సంపత్తి హక్కులను కల్పిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తుంది. ఇలా ధ్రువీకరణ పొందిన కంపెనీల వంగడాలను సాగుచేసే రైతులు తమ పంట దిగుబడులను విత్తనాల కోసం వాడుకోవటంతోపాటు... ఇతరులకు విక్రయించుకోవటానికి కూడా ఈ చట్టం రైతులకు విశిష్ట హక్కును కల్పిస్తోంది. ప్రత్యేకంగా బ్రాండ్‌పేరు ముద్రించిన సంచుల్లో పోసి విక్ర యించకూడదు. అయితే, భారతీయ రైతులకున్న ఈ విశిష్ట హక్కును కాలరాసిన పెప్సికో కంపెనీకి  చెంపపెట్టు లాంటి తీర్పును పి.పి.వి. అండ్ ఎఫ్.ఆర్.ఎ. వెలువరించింది.

లేస్ చిప్స్ తయారీకి వాడే ప్రత్యేక బంగాళదుంప వంగడానికి గతంలో ఈ కంపెనీకి ఇచ్చిన మేధాహక్కుల ధ్రువీకరణను రద్దుచేస్తూ ఈ తీర్పు వెలువడింది. పి.పి.వి. అండ్ ఎఫ్. ఆర్.ఎ. ఏర్పాటైన తర్వాత ఇలా ఒక వంగడంపై ధ్రువీకరణను రద్దుచేయటం ఇదే మొదటిసారి కావటంతో జాతీయ, అంతర్జాతీయ వ్యవసాయ, వాణిజ్య వర్గాల్లో తీవ్ర సంచలనం రేగింది.

**అసలేం జరిగిందంటే..**

లేస్ చిప్స్ తయారీ కోసం ఉపయోగించేందుకు ఉద్దేశించిన ఎఫ్.ఎల్. 2027 అనే రకం బంగాళదుంప వంగడంపై పెప్సికో ఇండియా హెూల్డింగ్ కంపెనీ 'పంట వంగడాల పరిరక్షణ, రైతుల హక్కుల ప్రాధికార సంస్థ'లో 2016లో రిజిస్ట్రేషన్ చేయించి మేధో సంపత్తి హక్కులను పొందింది. గుజరాత్‌లో 12,000 మంది రైతులతో కొనుగోలు ఒప్పందం చేసుకొని ఎఫ్.ఎల్.2027 రకం బంగాళదుంపలను పెప్సికో కంపెనీ సాగు చేయించింది. అయితే, ఈ రైతుల వద్దనుంచి ఈ రకం బంగాళదుంప విత్తనాలు పొంది అక్రమంగా సాగుచేయడం ద్వారా 9 మంది గుజరాత్ రైతులు మేధో సంపత్తి ఉల్లంఘనకు పాల్పడ్డారని పేర్కొంటూ గుజరాత్ రైతులపై కేసులు పెట్టింది. ఒక్కో రైతు నుంచి తమకు రూ. కోటి పరిహారం ఇప్పించా

పగ, ద్వేషం పతనం చేసే జాడ్యాలు, వాటిని వదిలించుకుంటే హృదయం ఎంతో నిర్మలం

ల్సిందిగా కూడా పెప్సికో కంపెనీ వ్యాజ్యంలో కోరింది. రైతులపై కేసులను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసనోద్యమం పెల్లుబకటంతో కంపెనీ వెనక్కి తగ్గి, కేసులు ఉపసంహరించుకుంది.

**కవిత దరఖాస్తు**

'పంట వంగడాల పరిరక్షణ, రైతుల హక్కుల చట్టం-2001' మన దేశంలో రైతులకు రిజిస్టరైన విత్తనాలను విత్తుకోవటం, దాచుకోవటం, ఇతరులతో పంచుకోవటం, బ్రాండ్ ముద్ర వేయకుండా ఇతరులకు విక్రయించుకునే హక్కులను కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో... ఆ వంగడంపై పెప్సికో కంపెనీకి మేధోసంపత్తి హక్కుల ధృవీకరణ ఇవ్వటం సమంజసం కాదని, ఆ ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రముఖ రైతు హక్కుల ఉద్యమకారిణి, కురుగంటి కవిత 2019 జూన్ 11న పి.పి.వి-ఎఫ్.ఆర్.ఎ.కు దరఖాస్తు చేశారు. 30 నెలల సుదీర్ఘ విచారణ తర్వాత పెప్సికో కంపెనీకి ఎఫ్.ఎల్. 2027 బంగాళదుంప వంగడంపై ఇచ్చిన మేధాహక్కుల ధృవీకరణను రద్దు చేస్తూ డిసెంబర్ 3న పి.పి.వి-ఎఫ్.ఆర్.ఎ. చైర్‌పర్సన్ కె.వి. ప్రభు తీర్పు ఇచ్చారు.

**ప్రజాప్రయోజనాలకు విఘాతం**

ధృవీకరణ కోసం కంపెనీ తప్పుడు సమాచారం ఇచ్చినందున, రిజిస్ట్రార్‌కు తగిన సమాచారాన్ని, పత్రాలను అందించనందున, పంట వంగడాల పరిరక్షణ, రైతుల హక్కుల చట్టం-2001 (సెక్షన్ 34 హెచ్) ప్రకారం 'ప్రజా ప్రయోజనాల'కు విఘాతం కలుగుతున్నందున, ధృవీకరణ పొందిన వ్యక్తికి తగిన యోగ్యత లేనందున మేధాహక్కుల ధృవీకరణ పత్రాన్ని రద్దు చేస్తున్నట్లు పి.పి.వి-ఎఫ్.ఆర్.ఎ. చైర్‌పర్సన్ కె.వి. ప్రభు ప్రకటించారు. రద్దు కాకుండా ఉంటే 2031 జనవరి 31 వరకు పెప్సికోకు మేధాసంపత్తి హక్కులు కొనసాగేవి. రైతుల చట్టబద్ధమైన విత్తన హక్కులను, స్వేచ్ఛను తుంగలో తొక్కాలని ప్రయత్నించే విత్తన, ఆహార, పానీయాల వాణిజ్య సంస్థల ఆటలు సాగవని చెప్పడానికి ఈ తీర్పు ఒక హెచ్చరికగా నిలుస్తుంది. ■

## కరివేపాకుతో ఎంత ఆరోగ్యమో !

గృహిణులందరికీ కరివేపాకంటే బోల్డంత ఇష్టం. కూర, చారు తాలింపులో అది తెచ్చే ఘుమాయింపు అలాంటిది మరి. అయితే పళ్లెంలోకి చేరగానే పక్కనపెట్టే వారే ఎక్కువ. అది ఎంత మంచిదో, దానిలో ఎన్ని ఔషధగుణాలున్నాయో తెలిస్తే ఇకపై ఆ పని చేయరు.



- కరివేపాకులో ఎ, బి, సి విటమిన్లు ఉన్నందున కళ్ళకు మంచిది. నోటిపూతలు, చూపు సమస్యలు రావు. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ప్రొటీన్లు, మినరల్స్, ఐరన్, ఉన్నందున ఎనీమియా సమస్య ఉత్పన్నం కాదు.
- ఇందులో పీచు పదార్థం అధికంగా ఉన్నందున మలబద్ధక సమస్యను నివారిస్తుంది. క్యాల్షియం ఎముకల్ని దృఢంగా చేస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లూ ఎక్కువే. దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు అనేక వ్యాధులు, ఇన్‌ఫెక్షన్‌ల నుంచి కాపాడతాయి.
- ఇది కాలేయానికి మంచిది. చర్మరక్షణకు దోహదం చేస్తుంది. పైత్యం, తల తిరగడం, మధుమేహం లాంటి అనేక సమస్యలను నివారిస్తుంది. ముఖ్యంగా గర్భిణుల్లో వికారానికి విరుగుడుగా పని చేస్తుంది.
- కొన్ని ఆకులను నీళ్ళలో మరిగించి వడకట్టి తాగితే జుట్టు కుదుళ్ళు గట్టిపడతాయి. తెల్లజుట్టు సమస్య నివారణ అవుతుంది.
- రోజూ పరగడుపున నాలుగైదు ఆకులు తింటే ఊబకాయం రాదు. ఈ ఆకుని వేయించి పొడి చేసుకుంటే ఇరవై రోజుల వరకూ తాజాగానే ఉంటుంది. దీనితో చేసే రోటి పచ్చడి నాలుగైదు రోజులు నిలవుంటుంది. ■

# సీమ రైతులను ముంచిన 'జాదూ' పత్తి విత్తనాలు !

## నకిలీ విత్తనాల వల్లే పంట దిగుబడి రాలేదు ... లాం, నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్తల నిర్ధారణ

నకిలీ విత్తనాలు రాయలసీమ ప్రాంత పత్తి రైతులను నట్టేట ముంచాయి. గడిచిన ఖరీఫ్ సీజన్‌లో కావేరి జాదూ పత్తి విత్తనాలు వాడిన రైతులంతా దగా పడ్డారు. ఎకరానికి రూ.40వేల నుంచి రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టి పంట సాగు చేయగా, దిగుబడి నామమాత్రంగా కూడా రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.700కు కొని, ఎకరానికి మూడు ప్యాకెట్ల చొప్పున వేశారు. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకూ దిగుబడి రావాల్సి ఉండగా కనీసం 2 క్వింటాళ్లు కూడా రాలేదు. జాదూ రకం బీటీ పత్తి వేసిన రైతులకు చివరికి పెట్టుబడులు కూడా దక్కలేదు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో అత్యధికంగా జాదూ రకం పత్తి వేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు.




నకిలీ విత్తనాలను అరికట్టడానికి విత్తన చట్టాన్ని తెచ్చిన ప్రస్తుత ప్రభుత్వం... సదరు కంపెనీపై చర్యలు తీసుకోకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా తప్పించుకునేందుకు కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించిందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పత్తి మద్దతు ధరను మించి రికార్డు స్థాయిలో పలుకుతోంది. క్వింటాలు రూ.10వేలకు పైగా పలకడంతో రైతుల ఇంట సిరులు కురుస్తున్నాయి. మరోవైపు నకిలీ విత్తనాలు వాడిన వారంతా నిండా మునిగారు. కనీసం పెట్టుబడులు కూడా దక్కలేదని వాపోతున్నారు.

**దగాపడిన రైతన్న**

కర్నూలు, అనంతపురం, ప్రకాశం, గుంటూరు, కృష్ణాజిల్లాల్లో ఈ ఏడాది 15లక్షల ఎకరాల్లో పత్తి సాగయింది. అయితే కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వేలాది ఎకరాల్లో ఎక్కువమంది రైతులు కావేరి జాదూ కంపెనీ బీటీ పత్తి విత్తనాలను వాడారు. ఈ రకం విత్తనాలు వాడిన అత్యధిక శాతం మందికి పంట సరిగ్గా పండలేదు. పత్తి దిగుబడి రాకపోవడంతో బాధిత రైతులు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులతో కలసి కంపెనీ ప్రతినిధులు కూడా అనేకచోట్ల పత్తి చేలను పరిశీలించారు. తర్వాత లాంఫాం, నంద్యాల ఫారాల వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన చేసి, నకిలీ విత్తనాల వల్లే పంట దిగుబడి రాలేదని నిర్ధారించారు.

దీంతో నకిలీలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.23 వేలు చొప్పున జనవరిలోగా పరిహారం ఇవ్వాలని కంపెనీని జిల్లా వ్యవసాయ అధికారులు ఆదేశించారు. ఇది జరిగి 20 రోజులు దాటినా పరిహారం ఊసెత్తకుండా ఆ కంపెనీ హైకోర్టును ఆశ్రయించడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది.


నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల జాబితాల తయారీలో క్షేత్రస్థాయి సిబ్బంది మండిపడుతూ రైతులు ఆందోళనలు చేశారు. అనేక చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. రెండు రోజుల క్రితం కర్నూలు పర్యటనకు వెళ్లిన వ్యవసాయశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్‌ను రైతు నేతలు కలిసి పత్తి రైతులకు జరిగిన నష్టాన్ని, అన్యాయాన్ని ఏకరవు పెట్టారు. కావేరి జాదూ కంపెనీపై విత్తన చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, బ్లాక్ లిస్టులో పెట్టాలని, బాధితులకు పరిహారం ఇప్పించాలని రైతు నేతలు డిమాండ్ చేశారు. ■

నీ మనసు సంతోషంగా వుంటే ఎదుటి వారిలో సంతోషాన్నే అది కోరుకుంటుంది


# తక్కువ ఖర్చుతో పండు ఈగల నివారణ ప్రక్రియ !




ఒక ఖాళీ 1 లీ వాటర్ బాటిల్ తీసు కొని దాని మూతకి దిగువ భాగంలో మూడువైపుల ఒక అంగుళం వెడల్పుతో కిటికీ మాదిరి రంధ్రాలు చేయాలి.



బాటిల్ మూతకు ఒక చిన్న రంధ్రాన్ని చేయాలి.





10 అంగుళాల ఒక సన్నని వైరుని మూత రంధ్రం ద్వార చొప్పించి, మూత వెలుపల వైరుని బాటిల్‌ని వేలాడదీయుటకు అనువుగా ఉచ్చు మాదిరి ముడి వేయాలి. పై విధంగానే మూత లోపల ఉన్న వైరుని ఎర (ల్యూర్)ను బాటిల్ లోపల అమర్చడానికి అనువుగా ముడిని తయారు చేసుకోవాలి.




అర అంగుళం మందం కలిగిన నూలు (కాటన్) తాడును 2 అంగుళాల పరిమాణంతో కత్తిరించి దాని రెండు చివరలా (కొనలను) ఒక సన్నని తీగతో గట్టిగా కట్టాలి.






ముందుగా కత్తిరించి ఉంచుకున్న రెండు అంగుళాల నూలు (కాటన్) తాడుని ME/ Cue ల్యూర్ మిశ్రమంలో 24 గంటలపాటు నానబెట్టాలి. ఇలా నానబెట్టిన తాడుని ఎరలా వినియోగించే వరకు ఒక అల్యూమినియం పేపరుతో చుట్టి ఉండాలి.



ఎరను ఉపయోగించునపుడు నూలు తాడుకు చుట్టి ఉంచిన అల్యూమినియం పేపరును మూడోవంతు తొలగించాలి. ఇలా తొలగించిన భాగంలోమూతకి ఉన్న వైరుకుకట్టి బాటిల్లో వేలాడదీయాలి.



ఇలా తయారుచేసిన బాటిల్ ఎర (ట్రాప్)ను తోటలో అక్కడక్క నేలకి 3-4 అడుగుల ఎత్తులో వేలాడతీయాలి.

**ఎర (ల్యూర్స్) తయారీ విధానం:**

మిథైల్ యుజినాల్ (ఎంఇ): ఇథైల్ ఆల్కహాల్ 60 మి.లీ మిథైల్ యుజినాల్ 40 మి.లీ+మెలాథియాన్/ డిడివిపి (2,2-డైక్లోరోవినైల్ డైమెథైల్ ఫాస్పేట్) 20 మి.లీ (6:4:2 నిష్పత్తి) మిశ్రమాన్ని ఎంఇ ల్యూర్ తయారీలో వినియోగిస్తారు.

Cue ల్యూర్: ఇథైల్ ఆల్కహాల్ 60 మి.లీ Cue ల్యూర్ (పీ-ఎసిటోక్సీ ఫినైల్ బ్యుటనోన్-2) 40 మి.లీ + మెలాథియన్/ డి డి వి పి (2.2 - డైక్లోరో వినైల్ డైమెథైల్ ఫాస్పేట్) 20 మి.లీ (6:4:2 నిష్పత్తి) మిశ్రమాన్ని Cue ల్యూర్ తయారీలో వినియోగిస్తారు.

---


*ఎరలను తయారు చేయు గదులలో గాలి మరియు వెలుతురు బాగా ఉండేట్లు చూసుకోవాలి. తయారుచేయు సమయంలో చేతికి గ్లౌజులను ధరించాలి. ఎర తయారీకి ఉపయోగించే వస్తువులను ఎర తయారీకి మాత్రమే వినియోగించాలి. ఒక బాటిల్ ఎర (ట్రాప్) తయారీలో ఉపయోగించే ఎం ఇ మరియు జబవ ఎర ఖరీదు సుమారుగా రూ.35/-.*


*"ఎరను వినియోగించు విధానం కొరకు ప్రక్క పేజీలో చూడుము.*

**ఏ చెడు అలవాటుకూడా దానంతట అది పోదు, ప్రయత్నించి వదిలించుకోవాలి**

# మిథైల్ యుజినాల్ ఎరకు ఆకర్షించబడిన పండు ఈగలు


మామిడినాశించు పండు ఈగ బేక్ట్రొసిరా డోర్సాలీస్


జామనాశించు పండు ఈగ బేక్ట్రొసిరా కరేక్టా


పీచ్‌ను ఆశించు పండు ఈగ బేక్ట్రొసిరా జోనాట


బేక్ట్రొసిరా కారీయే

## మిథైల్ యుజినాల్ ఎర (ల్యూర్) వినియోగం


**పంటలు : మామిడి, జామ, బొప్పాయి, నిమ్మ మరియు ఇతర పండ్ల పంటలు**

| పర్యవేక్షణ కొరకు | ప్రాంతాల వారీగా నియంత్రణ కొరకు |
|---|---|
| • ఒక చదరపు కిలోమీటర్‌కి ఎరల సంఖ్య : 1<br>• సమయం : ఏడాది పొడవునా<br>• భర్తీ : 30–40 రోజులకి ఒకసారి<br>• ఒక చదరపు కిలోమటర్ వినియోగించు ఎరల సంఖ్య : 8–12 / ఏడాదికి | • ఒక ఎకరాకి వినియోగించు ఎరల సంఖ్య : 6–10<br>•సమయం: పండ్లతయారీ సమయం నుండి కోతకొచ్చేవరకూ<br>• భర్తీ : 30–40 రోజులకి ఒకసారి<br>• ఒక ఎకరాకి ఒక సీజన్లో వినియోగించు మొత్తం ఎరల సంఖ్య : 12–20 లేదా 18–30 (పంటను బట్టి) |

## Cue ఎర (ల్యూర్) వినియోగం

**పంటలు : దోసకాయ, పుచ్చకాయ, గుమ్మడికాయ, కాకరకాయ, పొట్లకాయ, దొండకాయ, బీరకాయ, సొరకాయ మరియు ఇతర దోస పంటలలో మరియు కొన్ని పండ్ల జాతులు (మామిడి, జామ, సపోట, నిమ్మ మొ॥వి)**

| పర్యవేక్షణ కొరకు | ప్రాంతాల వారీగా నియంత్రణ కొరకు |
|---|---|
| • ఒక చదరపు కిలోమీటర్‌కి ఎరల సంఖ్య : 1<br>• సమయం : ఏడాది పొడవునా<br>• భర్తీ : 30–40 రోజులకి ఒకసారి<br>• ఒక చదరపు కిలోమటర్ వినియోగించు ఎరల సంఖ్య : 8–12 / ఏడాదికి | ఒక ఎకరాకి వినియోగించు ఎరల సంఖ్య : 6–10<br>సమయం: పండ్లతయారీ సమయం నుండి కోతకి వచ్చే వరకూ<br>భర్తీ : 30–40 రోజులకి ఒకసారి<br>ఒక ఎకరాకి ఒక సీజన్లో వినియోగించు మొత్తం ఎరల సంఖ్య: 12–20 లేదా 18–30 (పంటను బట్టి) |


పుచ్చకాయను నాశించు పండు ఈగ బేక్ట్రొసిరా కుకుర్బీటే


బేక్ట్రొసిరా టవు


బేక్ట్రొసిరా నిగ్రోఫెమోరాలిన్


బేక్ట్రొసిరా కాడేటా

అవకాశంకోసం ఎదురుచూస్తూ కూచోకు, ఎదురువెళ్ళి నీవే అందిపుచ్చుకో

# ఏడు సొరంగాలు తవ్వి ... నీళ్ళు తెచ్చాడు!

'బోడికొండను తవ్వి నీళ్లు తెస్తానంటున్నావ్... పిచ్చోడివే నువ్వు! ' ... అని నవ్వారు అతడి మాట విన్నవాళ్ళు. "ఈ కూలీవాడికి భూస్వామి కావాలని ఎంత కోరికో!" అని కుళ్ళుకున్నారు కొందరు. కానీ మహాలింగ నాయక్ అవేవీ పట్టించుకోలేదు... ఒంటి చేత్తో పర్వతాన్ని తొలచి ఏడు సొరంగాలు తవ్వాడు. అతని పట్టుదలకు కొండకూడా తలవంచి నీళ్ళివ్వక తప్పలేదు. అతను చేసిన ఆ అసాధారణ పోరాటానికి మెచ్చి కేంద్ర ప్రభుత్వం అప్పై మహాలింగ నాయక్‌కు ఇటీవల పద్మశ్రీ ప్రకటించింది!

---------

**చి**న్నప్పటి నుంచీ రైతుని కావాలన్నదే నా కల... దాని సాకారం కోసమే ఇంతా చేశాను!' అంటాడు డెబ్భైయేళ్ళ మహాలింగ నాయక్. ఊహ వచ్చినప్పటి నుంచీ నాయక్‌ది రైతుకూలీ జీవితమే. పదేళ్ళ వయస్సులోనే ఎత్తయిన కొబ్బరిచెట్లూ, పోకచెట్లెక్కి కాయలు కోయడం నేర్చుకున్నాడు. ఎండా, వానా అనకుండా శ్రమించి తన యజమానికి



నమ్మినబంటయ్యాడు. తన యజమానిలా తానూ రైతు కావాలనుకున్నాడు. కానీ తనకంటూ ఉండటానికి గుడిసె కూడా లేనివాడు... రైతు ఎలా అవుతాడు, ఏదో వింత జరిగితే తప్ప! అలాంటి అనుకోని వింత 1978లో జరిగింది. పాతికేళ్ళుగా తన దగ్గర కూలీగా ఉంటున్నాడన్న దయతో ఆ రైతు మహాలింగనాయక్‌కు రెండెకరాల భూమి యిచ్చాడు. 'ఇక నేనూ రైతునే!' అని సంబరపడిపోతున్న నాయక్‌ను చూసి 'ఇల్లలకగానే పండగైపోదు. మీయజమాని నీకిచ్చిన నేలలో గడ్డికూడా మొలవదు!' అన్నారట స్నేహితులు. వాళ్ళ మాటల్లో నిజం లేకపోలేదు...

**ఒట్టి రాతి నేల...**

నాయక్‌కు దక్కిన భూమి ఉండేది ఓ కొండపైన...అదీ శిఖరానికి దగ్గరగా! అలాంటిచోట సాగుకి కాదుకదా... కనీసం తాగడానికి కూడా నీళ్ళు దొరకవు. రాతి నేల కాబట్టి బావులూ, కుంటలూ తవ్వే వీలూలేదు. అయినా అక్కడే మొండిగా గుడిసె వేసుకున్నాడు నాయక్. పెళ్ళి కూడా చేసుకున్నాడు. అరకిలోమీటరు దూరం వెళ్ళి తాగు నీళ్ళు తెచ్చుకునేవాడు. ఆ నీటి సమస్య తీరడమెట్లా అని సదా ఆలోచిస్తుండేవాడు. అప్పుడే ఈ ప్రాంతంలోని వాళ్ళు అనుసరించే ఓ పాతపద్ధతి గురించి అతనికి తెలిసింది. మామూలుగా మనం నీటికోసం బావులు తవ్వుతాం కదా...కానీ కర్ణాటక పశ్చిమ కోస్తాలోని ఈ పర్వత ప్రాంతంలో నీటి కోసం కొండల్ని తొలిచి సొరంగాలు చేస్తారు! ఆ పద్ధతిని ఇప్పుడెవరూ పాటించ కున్నా... బీడుపడిపోతున్న తన రెండెకరాల కోసం నాయక్ తానూ కొండల్లో సొరంగం తవ్వాలనుకున్నాడు.

బతుకుదెరువు కోసం రోజంతా కూలికెళ్ళేవాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక ఓ గునపంతో కొండను తొలిచేవాడు. ఇతను తొలుస్తూ ముందుకెళుతుంటే భార్య లలిత... వెనకే గంపతో వచ్చి మట్టి తీస్తూ ఉండేది. ఇద్దరూ రాత్రి పదకొండుదాకా ఇలా పని చేసేవారు. అలా ఏడాది పాటు తొలిచి 35 మీటర్ల సొరంగం చేశాడు. అంత చేసినా, కొండలో నీటి జాడ కానరాలేదు. నాయక్ నిరాశపడ్డా... ప్రయత్నం మానలేదు. మరో చోట తొలవడం మొదలు

గెలుపుబాట నిటారుగా ఎక్కవలసిన కొండలాంటిది, తక్షణమే గమ్యం రాలేదని ఆరాటపడకు



పెట్టాడు. అక్కడా ఏడాది కష్టం వృధా అయింది. మరో రెండేళ్ల తర్వాత మరో రెండు సొరంగాలు తయారైనా చుక్కనీరూ కానరాలేదు. ఈలోపు ఊళ్ళోవాళ్ళందరూ నాయక్‌ని పిచ్చివాడికిందే జమ కట్టేయడం మొదలుపెట్టారు. అయితేనేం, నాయక్ ఐదో సొరంగం తవ్వుతున్నప్పుడు తొలిసారి పైకప్పుపైన నీటి చెమ్మ కనిపించింది. దాంతో ఓ అంచనాకు వచ్చిన నాయక్ ఈసారి కొంత ఎత్తు నుంచి తవ్వడం ప్రారంభించాడు. ఆ ప్రయత్నంలో 65వ మీటరు వద్ద ఈసారి జల... ఓ సన్నటి ధారలా ప్రత్యక్షమైంది.

ఆ నీటి ధారనిబట్టి, ఆరో సొరంగం నుంచి పక్కకెళ్ళి.. ఏడో సొరంగమూ తవ్వాడు. ఈసారి నీరు... ఓ పెద్ద ఊటలా పొంగి అతని కాళ్ళని తడిపింది! ఇంకేముంది... రాత్రికి రాత్రే వెదురుబొంగుతో ఆ నీటిని మళ్ళించే ప్రయత్నం మొదలుపెట్టాడు. వాటిని నిల్వ చేయడానికి ఓ భారీ తొట్టెను నిర్మించుకున్నాడు. మండువేసవిలో కూడా రోజుకి మూడువేల లీటర్ల నీరు ఉంటాయట ఆ తొట్టెలో!

**అవార్డులే అవార్డులు...**

ఎనిమిదేళ్ళపాటు కొండను తవ్వి తెచ్చిన నీటితో నాయక్... తన రెండెకరాల స్థలంలో మూడొందల పోకచెట్లు, 75 కొబ్బరి, 150 జీడిమామిడి, రెండువందల అరటి చెట్లని పెంచగలిగాడు. నీరు ఎత్తునుంచి కిందికి సహజంగానే ప్రవహిస్తుంది కాబట్టి తన పొలానికి నీరు పారించడానికి మోటార్లు, కరెంటూ, డీజిలూ వంటివాటి అవసరం రాలేదంటాడు నాయక్!

కర్ణాటకలోని విఠల-కాసర్గోడు హైవే పక్కన... మంగళూరుకు 55 కిలోమీటర్ల దూరంలో ఆద్యనాదక్ అనే



గ్రామంలో ఉంటున్న మహాలింగ నాయక్ పొలం ఇప్పుడు చుట్టుపక్కల రైతులకు ఓ సందర్శనీయ ప్రాంతం. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) కూడా నాయక్ చేసిన కృషిపైన ప్రత్యేక పరిశోధనే చేసింది. ఆ పరిశోధనే మహాలింగనాయక్‌ను పద్మశ్రీ దాకా తీసుకెళ్ళింది!

– (ఈనాడు సౌజన్యంతో...)

# వరంగల్లు ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు శిక్షణ




వరంగల్లు క్లస్టర్ ఎఫ్‌పిఓల సిఇఓలకు ఆకౌంటింగ్, లీగల్ కాంప్లయన్సెస్ అంశాలపై ఏపిమాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. నాబార్డ్ సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణలో లీగల్ కాంప్లయన్స్‌ల గురించి శ్రీ వెంకటాచలం మాట్లాడుతూ ఎఫ్‌పిఓలకు యంఓఎ, ఏఓఎలు భగవద్గీత లాంటిదని అన్నారు. అందులోని చట్టాలు, ఎఫ్‌పిఓల పాలకవర్గం అధికారాలు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, బెనిఫిట్స్ ఆఫ్ మెంటర్స్, సిఇఓ విధులు, జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేయడం, ఫైనాన్స్ అకౌటింగ్, అడిటింగ్ తదితర అంశాలపై సి ఇ ఓ లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.




ఎఫ్‌పిఓలు నడపడం ఎంత ముఖ్యమో కంపెనీ చట్టాలకు లోబడి పని చేయటంకూడ అంతే ముఖ్యం. కంపెనీ చట్టాలను పట్టించుకోకపోయిన, సరియైన సమయంలో ఫైలింగ్ చేయకపోయిన ఎఫ్‌పిఓలకు పెనాల్టీల భారం పడుతుందని చెప్పడం జరిగింది కాబట్టి ఎఫ్‌పిఓలపై పెనాల్టీల పడకుండా చూసుకునే భాధ్యత సి ఇ ఓ లకు ఉందని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని mca.gov.com portol ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చుని, అలాగే ఎఫ్ పి ఓలు స్వయంగా లేదా వారు ఏర్పాటు చేసుకున్న ఆడిటర్ ద్వారా సకాలంలో



అకౌంట్లు సమర్పించాలని సూచించారు.

సి ఇ ఓలు ఎఫ్‌పిఓ లను ముందుకు తీసుకెళ్ళడం కొరకు ఎఫ్‌పిఓ వాటాదారుల సంఖ్య పెంచడం, పలురకాల వ్యాపారాలను చేయటం, వ్యవసాయ పరికరాలను అందించటం, పుస్తక నిర్వహణ, లీగల్ కాంప్లయన్స్‌లను ఫైలింగ్ చేయడం, అడిట్ చేయించడం, బి ఓ డి సమావేశాలు నిర్వహించటం, జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయటం, నాబార్డ్ వారికి, పి ఓ పి ఎల్ లకు సకాలంలో రిపోర్ట్‌లను అందించటం వంటి కార్యక్రమాలను చేయవలసి వుంటుంది కాబట్టే సి ఇ ఓ లు ఎఫ్‌పిఓ లకు గుండెకాయ లాంటివారని ఏపిమాస్ ప్రతినిధి శ్రీ గంగాధర్ అన్నారు. ■

# తేనెటీగల పెంపకంతో ఉపాధి బాటలో...

వారంతా కూలీనాలి చేసుకొని పొట్టపోసుకునే కుటుంబాలకు చెందిన మహిళలు. వీరిలో ఒంటరిగా ఇంటి బాధ్యతలు భుజాన మోస్తున్న వారూ కొందరున్నారు. ఇప్పుడు వారంతా తేనెటీగల పెంపకం చేపట్టి ఉపాధి పొందుతున్నారు. ఒక సంఘంగా ఏర్పడి స్వచ్ఛంద సంస్థల సహకారంతో తమ జీవితాలను చక్కదిద్దుకుంటున్న తమిళనాడు మహిళల విశేషాలివి...

• • • • • •

తమిళనాడులోని తూతుకూడి జిల్లాలోని తిరుపని చెట్టికులం గ్రామానికి చెందిన పది మంది మహిళలు కొత్త మార్గంలో స్వీయ ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తేనె ఉత్పత్తి దారుల మహిళా సహకార సంఘానికి చెందిన పదిమంది మహిళలు మూడు ఎకరాల్లో తేనెటీగల పెంపకం చేపడుతున్నారు. శ్రీనివాసన్ సేవా సమితి, టీవీఎస్ మోటార్స్ కార్పోరేట్ సామాజిక బాధ్యత విభాగం, సుందరం క్లేటన్ వంటి ప్రైవేట్ సంస్థలు వీరి సంఘానికి ఆర్థిక సాయం చేస్తున్నాయి. తమిళనాడులో 11 జిల్లాల్లో తేనె ఉత్పత్తి చేపడుతున్న శ్రీనివాసన్ సేవా సమితి వీరికి తేనెటీగల పెంపకం, తేనె సేకరణ, తేనె అమ్మకంలో కొన్నిరోజులు శిక్షణ ఇచ్చింది. అంతేకాదు నాబార్డ్ సంస్థ నుంచి వీళ్ళందరికి వ్యక్తిగత రుణాలు కూడా ఇప్పించింది.



**లాక్‌డౌన్‌తో ఆటంకం:** ఈ ప్రాజెక్ట్‌ను గత ఏడాది జనవరిలో మొదలెట్టారు. మహిళలు మొరింగ చెట్లను పెంచుతూ వాటి సమీపంలో తేనెటీగల పెంపకం చేపట్టి 65 లీటర్ల తేనె ఉత్పత్తి చేశారు. కానీ కరోనా, లాక్‌డౌన్‌తో పాటు ఆ సీజన్‌లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం కారణంగా కొన్ని రోజులు వాయిదా వేశారు. పరిస్థితులు చక్కబడడంతో మళ్ళీ తేనె ఉత్పత్తి ప్రారంభించారు. ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో తేనె అమ్మకాలు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. నాటిన అరు నెలల్లోనే మొరింగ చెట్లు పూతకు వస్తాయి. ముఖ్యంగా వేసవి నెలల్లో చెట్టు నిండా పూలు పూస్తాయి. అప్పుడు తేనెటీగలను పెంచితే ఎక్కువ తేనె సేకరించవచ్చు. అందుకే స్వచ్ఛంద సంస్థలు వీరికి ఫిబ్రవరి రెండో వారంలో తేనెటీగలను పెంచేందుకు వంద

(మిగతా 25వ పేజీలో )

*"మొరింగ తేనె సేకరించి విక్రయించడం ద్వారా మా బృందంలోని మహిళలు లబ్ధి పొందుతున్నారు. తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. నా భర్త వ్యవసాయం చేసేవారు. అయితే కొంతకాలంగా మా ఆయనకు ఆరోగ్యం బాగుండడం లేదు. ఇంటి వద్దనే ఉంటున్నారు. ఇల్లు గడవాలంటే నేను ఏదో ఒక పని చేయాల్సిన పరిస్థితి. అదేసమయంలో శ్రీనివాసన్ సేవా సమితి వాళ్లు తేనెటీగల పెంపకంతో డబ్బు సంపాదించవచ్చని చెప్పడంతో వెంటనే పనిలో చేరాను. మా బృందంలోని ఇద్దరికి చెందిన రెండు ఎకరాల స్థలంలో తేనెటీగల బాక్సలను ఉంచుతున్నాం. ఎక్కువ తేనె ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఈ మధ్యే ఇంకో ఎకరం స్థలం లీజుకు తీసుకున్నాం"అని చెబుతున్నారు ఈ మహిళల బృందానికి నాయకత్వం వహిస్తున్న 65 ఏళ్ల తమిళ్ సెల్వీ.*

# శాకాహారపు మాంసం కూర 'చక్రవర్తి'!

**శా**కమాంసం' అంటే మాంసంతో సమాన గుణధర్మాలు కలిగిన ఆకుకూర' అని! అలాంటి ఆకుకూర శాకాలలో చక్రవర్తే అని చెప్పొచ్చు. నిజంగా చక్రవర్తే దీని పేరు. చక్రవర్తికూర రుచికి పాలకూర మాదిరిగానే ఉంటుంది. ఇతర ఆకుకూరల్తో పోలిస్తే, చక్రవర్తి కూర అన్ని ప్రతికూల పరిస్థితులనూ, తెగుళ్ళను, పురుగులనూ తట్టుకుని తేలికగా పెరుగుతుంది.



చక్రవర్తి కూరని వాస్తుకం, వాస్తకం, వస్తుకం, హిలమోచకా, శాకరాజం, రాజశాకం ఇలా పిలుస్తారు. హిందీవాళ్ళు భటువా లేదా బతూవా అంటారు. తోటకూర లాంటి ఆకుకూరలు శ్రమించి పండిస్తేనే పండుతాయి. చక్రవర్తికూర దానికదే పుట్టి పెరుగుతుంది. ఒకింత ఖాళీ స్థలం దొరికితే చాలు తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. దీని ఆకులు, కాండం, వేర్లు, పూలు, గింజలు అన్నీ తినదగినవే!

**ప్రయోజనాలు**

దీని గింజల్లో 'ఎమినో యాసిడ్లు' ఎక్కువగా ఉంటాయి. బ్రెడ్ల తయారీలో ఈ గింజల్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఆకలిని పుట్టిస్తాయి. కడుపులో నులిపురుగుల్ని చంపుతాయి. పురుషత్వాన్ని పెంచుతాయి. అచ్చంగా ఈ గింజలతోనే అన్నం వండుకుంటారు కూడా! ఇది పట్టెడన్నం తింటే చాలు, ఏనుగంత శక్తి కలుగుతుంది. ఈ గింజలతో సూపులూ, జావలూ తయారు చేస్తుంటారు. చక్రవర్తి ఆకుల్లో నాణ్యమైన మాంసకృత్తులు ఉంటాయి. వివిధ పోషకాలతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ముంచుకొచ్చే వృద్ధాప్యాన్ని వాయిదా వేయగలుగుతాయి.

ఇందులో క్యారట్ కన్నా ఎక్కువ ఏ-విటమిన్ ఉంటుంది. అందుకని తక్కువ మోతాదులో తీసుకున్నా శక్తిమంతంగా పని చేస్తుంది. రేచీకటితోనూ, ఏ విటమిను లోపం వలన ఏర్పడే వ్యాధులతో బాధపడేవారికి ఈ చక్రవర్తి కూర గొప్ప ఔషధమే! ఆకుల రసాన్ని తేనె లేదా పంచదార కలిపి తాగితే ఎక్కువ సి-విటమిన్, ఐరన్ లభిస్తాయి. పొటాషియం, క్యాల్షియం, జింక్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల బీపీ, గుండె జబ్బులున్న వారికి మేలు చేస్తుంది. లివర్ వ్యాధులు, గాల్‌బ్లాడర్ స్టోన్స్, ప్లీహానికి సంబంధించిన వ్యాధుల్లో మేలు చేస్తుంది.

'చలవనిస్తుంది. తేలికగా అరుగుతుంది, జఠరాగ్నిని పెంచుతుంది, తీసుకున్న ఆహారాన్ని వెంటనే అరిగేలా చేస్తుంది' అని యోగరత్నాకరం అనే వైద్య గ్రంథం వివరిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగేలా చేస్తుంది. రక్తదోషాలను పోగొడుతుంది. కడుపులో పెరిగే నులిపురుగులు పడిపోయేలా చేస్తుంది. విరేచనం ఫ్రీగా అవుతుంది. మొలల వ్యాధికి మంచి ఔషధం కూడా! వాపు, కణితి, గడ్డలు వీటిని కరిగించే శక్తి ఈ ఆకులకుంది. స్త్రీలలో ఋతువు సక్రమంగా వచ్చేలా చేస్తుంది. గర్భవతులకు పరిమితంగా పెట్టటం మంచిది.

**తయారీ ఇలా...**

నలుడు పాకదర్పణంలో చక్రవర్తి మొక్క అకులతో కూర వండుకునే పద్ధతిని ఇలా వివరించాడు. మెత్తగా లేతగా ఉన్న చక్రవర్తి ఆకుల్ని లేత కాడలతో సహా తీసుకుని శుభ్రంగా కడిగి సన్నగా తరగాలి. చిటికెడంత పచ్చకర్పూరం, అల్లం ముద్దను ఈ ఆకుతరుగుతో కలిపి ఒక బాండీలో ఉంచి, తడిగుడ్డ మూతగా పెట్టి కొద్దిసేపు ఒకపక్కన ఉంచండి. తరువాత, కొంచెం ఇంగువ, కొద్దిగా పాలు,

# తెలంగాణ నేలపై విరగకాసిన రుద్రాక్ష !

తెలంగాణ నేలలు ఏ పంటకైనా, ఏ వృక్ష జాతికైనా అనువైనవేనని మరోసారి నిరూపితమైంది. కేవలం శీతల ప్రాంతాల్లోనే పండే ఆపిల్ సాగు ఇదివరకే సాకారం కాగా తాజాగా రుద్రాక్ష చెట్టుకు కాయలు కాశాయి. హిమాలయాలు, పర్వత శ్రేణుల్లో కనిపించే రుద్రాక్ష వృక్షం మన నేలపైనా ఫలాలను అందిస్తున్నది. నేపాల్, మయన్మార్, థాయిలాండ్, ఇండోనేషియా, భారత్‌లోని హిమాలయాల్లో మాత్రమే మనగలిగే రుద్రాక్ష వృక్షం రాష్ట్రంలోని పలు ప్రాం తాల్లో సాగవుతున్నది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం న్యాలకొండపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్డీవో ఆకుల లక్ష్మయ్య తన మామిడి తోటలో 14 ఏండ్ల కింద రెండు రుద్రాక్ష మొక్కలను నాటారు. ఒక్కో వృక్షం 25 నుంచి 30 అడుగుల ఎత్తుకు ఎదిగింది. ఏండ్ల తర్వాత



ఇప్పుడు ఆ చెట్టు విరగకాసింది. మిత్రుడి సలహాతో 2007లో హైదరాబాద్‌లోని గ్రోమోర్ నర్సరీ నుంచి రెండు రుద్రాక్ష మొక్కలు తెచ్చి తోటలో నాటానని, ఇన్నేండ్లకు కాత రావడం ఆనందంగా ఉన్నదని లక్ష్మయ్య చెప్పారు. అరుదైన రుద్రాక్షలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నదని పేర్కొన్నారు.

(నమస్తే తెలంగాణా సౌజన్యంతో)

---

కాసిని చక్రవర్తి ఆకుల్ని విడిగా తీసుకుని మిక్సీపట్టి రసం తీసి,ఈ భాండీలో కలపండి. భాండీని పొయ్యి మీద ఉంచి, నీళ్ళ మూత పెట్టి ఆకులు మెత్తగా ఉడికేలా మగ్గనివ్వండి.



మగ్గిన తరువాత తగినంత ఉప్పు, మిరియాల కారం, కావలసిన సుగంధ ద్రవ్యాలు కలుపుకొంటే చక్రవర్తి ఆకుల కూర సిద్ధం అయినట్టే! ఇందులో బీన్సు, కొబ్బరి తురుము, ధనియాల పొడి లాంటివి కలిపి కూడా కూరగా వండుకోవచ్చని చెప్పాడు. ఆకుకూరలన్నీ ఎలా వండుకుంటామో అలాగే దీన్నివండుకోవచ్చు. బూడిద గుమ్మడి వడియాలు, అప్పడం ముక్కలూ కలిపి వండుకుంటే ఇంకా రుచికరంగా ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

---

### తేనెటీగల పెంపకంతో ఉపాధి బాటలో...

*(23వ పేజీ తరువాయి)*



బాక్స్‌లను తక్కువ ధరకే అందిస్తున్నారు. గతంలో నాగర్‌కోలి జిల్లాలోని మార్తాండం గ్రామానికి చెందిన తేనెటీగల పెంపకందారులు వీరి గ్రామంలోనూ తేనెపెట్టెలు ఏర్పాటు చేసేవారు. వారి దగ్గర నుంచి ఈ మహిళలు రూ. 500లకు తేనె కొని, దానిని శుద్ధిచేసి 800 రూపాయలకు అమ్మేవారు. కొద్దిపాటి లాభమే వచ్చేది. అయితే ఇప్పుడు వీరే సొంతంగా తేనె సేకరిస్తుండడంతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ తీయని ఆరంభాన్ని గొప్ప మైలురాయిగా మలచుకోవాలనుకుంటున్నారు ఈ మహిళలు.

**నిండా డబ్బున్న జేబు నీ పతనానికి దారులు చూపితే, ఖాళీ జేబు నీ ఔన్నత్యానికి బాట వేస్తుంది**

# ఎఫ్ పి ఓల ద్వారా ఉద్యాన ఉత్పత్తుల సేకరణ

దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయడంతో పాటు రైతులకు మంచి ధర లభించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఉద్యానశాఖ ద్వారా పండ్లు, కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

**ఎలా నిర్మిస్తారంటే...**

వీటిని రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవోల) ద్వారా గ్రామ స్థాయిలోనే నిర్మిస్తారు. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల వ్యయం కానుంది. ఈ సొమ్ములో 75 శాతం రాయితీ కూడా ఇస్తోంది. మిగిలిన సొమ్మును బ్యాంకులు నామ మాత్రపు వడ్డీకే రుణాన్ని సమకూరుస్తాయి. ఈ నిధులతో ఎఫ్‌పీవోలు గోదాములు / షెడ్లను నిర్మిస్తాయి. వీటిలో ప్లాస్టిక్ క్రేట్లు, గ్రేడింగ్ టేబుల్, తూకం యంత్రం (250 కిలోల సామర్థ్యం), వాపింగ్ టబ్స్ , ఆఫీస్ టేబుల్, కుర్చీలు, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, లైట్లు, ఇన్వర్టరు, 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగి నీళ్ల ట్యాంకు వంటి వాటితోపాటు రవాణాకు వీలుగా ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేస్తారు. అవసరమైన కొన్ని కేంద్రాల్లో కూరగాయలు, పండ్లు నిల్వ చేసుకోవడం కోసం 10 టన్నుల నిల్వ సామర్థ్యం ఉండే సౌర శీతల గదిని, పండ్లను మగ్గబెట్టే రైపెనింగ్ గదులను నిర్మిస్తారు. వీటిలో పండ్లు కూరగాయలను మంచి ధర లభించే వరకు నిల్వ ఉంచుకుని అమ్ముకునేందుకు వీలవుతుంది.

**తప్పనున్న దళారుల బెడద...**

ఈ కలెక్షన్ సెంటర్లు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇన్నాళ్ళూ రైతులు పండించిన పండ్లు, కూరగాయలు దళారుల ద్వారా అమ్ముకోవలసి వస్తోంది. దీంతో రైతుకు ఆశించిన ధర రాక నష్టపోతున్నాడు. ఉదాహరణకు మామిడి కొనుగోలుకు దళారులు కనీసం టన్నుకు 10 శాతం కమీషన్‌గా తీసుకుంటారు. పైగా గిట్టుబాటు ధర కూడా ఇవ్వరు. ఇలా సగటున రైతు 30 శాతం వరకు ధరను నష్టపోతున్నాడు. ఇకపై పండించిన ఉత్పత్తులను ఈ కామన్ పాయింట్ కేంద్రాలకు తెచ్చి అక్కడే గ్రేటింగ్, ప్యాకింగ్ చేసి అమ్ముకోవచ్చు. పరిశుభ్రత, గ్రేడింగ్ వల్ల నాణ్యత మెరుగుపడుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు / కొనుగోలుదార్లే నేరుగా ఈ కేంద్రాలకు వచ్చి పండ్లు, కూరగాయలను కొనుగోలు చేస్తారు. దీంతో ఉద్యాన రైతుకు దళారీ బెడద తప్పుతుంది. నాణ్యతతో మంచి ధర లభిస్తుంది.

**30 చోట్ల గుర్తింపు...**

జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 30 చోట్ల కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. అక్కడ పనులు ప్రారంభించడానికి ఉద్యానశాఖ అధికారులు ఉద్యుక్తులవుతున్నారు. త్వరలో మరికొన్ని సెంటర్లకు స్థలాలు ఖరారు చేయనున్నారు. రానున్న నాలుగైదు నెలల్లో మిగిలిన వన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సీజన్లో కొన్నింటినైనా అందుబాటులోకి తీసుకురావాలని, మామిడి రైతులు వీటిని ఉపయోగించేలా చూడాలని వీరు ప్రయత్నిస్తున్నారు. ఈ కేంద్రాల ప్రయోజనాలపై ఎఫ్‌పీఓలతో సమావేశమవుతున్నారు. వీటిపై ఎఫ్‌పీఓలు ఆసక్తి చూపుతున్నాయి.

**రైతులకు ఎంతో ప్రయోజనం..**

పండ్లు, పంట ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. రైతులు పండించిన పండ్లు, కూరగాయలు, ఇతర ఉత్పత్తులను అధిక శాతం దళారులే కొనుగోలు చేస్తున్నారు. వారి నుంచి భారీగా కమీషన్లు తీసుకుంటున్నారు. ఇకపై ఈ సెంటర్లు అందుబాటులోకి వస్తే దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. ఈ కేంద్రాల్లో ఉత్పత్తుల నాణ్యత పెంచే సదుపాయాలు ఉంటాయి. ఫలితంగా నాణ్యత పెరిగి రైతుకు మంచి ధర దక్కుతుంది. సాధ్యమైనంత త్వరగా వీటిని అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తున్నాం.

***– దయాకర్‌బాబు, ఏ డి***

■

**విజేతల జీవితాలు సందేశాన్ని అందిస్తే, పరాజితుల జీవితాలు పరిష్కారాన్ని చూపుతాయి**

# రసాయన రహిత సహజ వ్యవసాయానికి ప్రోత్సాహం

**కేం**ద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రసాయన రహిత సహజ వ్యవసాయానికి (సేంద్రియ వ్యవసాయం) తగిన ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు 2022 బడ్జెట్ ప్రతిపాదనలలో ప్రకటించారు. హానికరమైన రసాయనాలు ఉపయోగించ కుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం ప్రస్తుత కరోనా సమయంలో చాలా ముఖ్యమని మంత్రి తెలిపారు. అందుకే ఆ దిశగా 'కెమికల్-ఫ్రీ నేచరల్' వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో గంగానది పరివాహక ప్రాంతాల్లోని 5 కిలోమీటర్ల లోపు ఉన్న వ్యవసాయ భూముల రైతులతో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపడతా మన్నారు. అలాగే రాష్ట్రాలు కూడా ఈ విధానికి ఊతమిచ్చేలా వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో సిలబస్‌లో మార్పు చేసి సేంద్రియ వ్యవసాయానికి మద్దతుగా పాఠ్యాంశాలు తీసుకురావాలని కోరారు.

ఆర్గానిక్ ఫార్మింగ్, మోడ్రన్-డే అగ్రికల్చర్‌లకు ప్రోత్సహకాలను తగ్గించాలని తెలిపారు. అప్పుడే సేంద్రియ వ్యవసాయం ఆచరణలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత కరోనా సమయంలో ఆరోగ్యానికి రసాయనాలు వాడి పండించే ఆహార పదార్థాలు ఎంత మాత్రం మంచివి కావని మంత్రి అభిప్రాయపడ్డారు. కనుక కెమికల్ - ఫ్రీ నేచరల్ వ్యవసాయం ఈ సమయంలో చాలా అవసరం అన్నారు. ఇక సేంద్రియ వ్యవసాయం అనేది ప్రకృతి సిద్ధమైన పర్యావరణ అనుకూలమైన జీవాధారిత వ్యవసాయం. ముఖ్యంగా ప్రాంతీయంగా లభించే వనరులతో వ్యవసాయం చేయుటకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు హానికర రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని విసర్జిస్తూ పూర్తిగా ప్రకృతికి అను గుణంగా వ్యవసాయం చేయడానికి అవకాశం కల్పిస్తుంది.

**ఒక్కో రైల్వే స్టేషన్ పరిధిలో ఒక ఉత్పత్తికి శ్రీకారం**

**ఇ**క మీదట ప్రాంతీయ ఉత్పత్తులకు దేశవ్యాప్త ప్రచారం తీసుకు వచ్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త నిర్ణయాన్ని తీసుకుంది. దేశవ్యాప్తంగా ఒక్కో రైల్వే స్టేషన్ పరిధిలో ఒక ఉత్పత్తికి ప్రచారం, ప్రోత్సాహం కల్పిస్తారు. రైల్వేశాఖ వీటిని అభివృద్ధి చేస్తుంది. తద్వారా స్థానిక వ్యాపారులు, ఎంఎస్ఎంఈలకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేయవచ్చన్నది కేంద్రం ఆలోచన.

ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రకటించారు. అలాగే, 400 వందే భారత్ రైళ్లను ప్రవేశపెడతామని తెలిపారు. ■

## సి విటమిన్ రారాజు జామ !

**రో**గనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ 'సి' కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి ప్రతి వ్యక్తీ రోజుకు 90 మిల్లీగ్రాముల విటమిన్ సి తీసు కుంటూ ఉండాలి. ఇందుకోసం పండ్ల మీద ఆధారపడవచ్చు.



**జామ:** ఒక కప్పు జామ ముక్కల్లో 377 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది.

**కివి:** ఒక కప్పు కివి ముక్కల్లో 167 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది.

**బెల్ పెప్పర్:** ఒక కప్పు బెల్‌పెప్పర్ ముక్కల్లో 152 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది.

**స్ట్రాబెర్రీ:** ఒక కప్పు స్ట్రాబెర్రీల్లో 98 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది.

**నారింజ:** ఒక కప్పు నారింజ తొనల్లో 96 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది.

**టమాటా:** ఒక కప్పు టమాటా ముక్కల్లో 55 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది.

**బ్రకోలి:** ఒక బ్రకోలి ముక్కల్లో 81 మిల్లీ గ్రాముల సి విటమిన్ ఉంటుంది. ■

# అభాగినులకు అండగా యోగిత పోరాటం!

**మ**నసు కదలడానికీ, మెదడులో ఆలోచన పుట్టడానికీ ఒకే ఒక్క సంఘటన సరిపోతుంది. గుండెను పిండేసే అలాంటి కొన్ని సంఘటనలు యోగితా భాయనను సమాజ సేవ వైపు నడిపించాయి. రోడ్డు ప్రమాద బాధితులు, అత్యాచార బాధితుల కోసం స్వచ్ఛంద సంస్థలను స్థాపించింది ఈ ఢిల్లీ అమ్మాయి. అందుకోసం విమానయాన వృత్తిని సైతం వదిలేసుకున్న యోగితా కథ ఆమె మాటల్లోనే....

'నేను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే వయోవృద్ధుల కోసం బడిలో నిధులు సేకరించేదాన్ని. బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు మా ఇంటి ముందున్న చెట్టు కింద పాఠాలు



చెప్పేదాన్ని. అయితే అందరు పిల్లల్లాగే నేనూ చక్కగా చదువుకుని, నచ్చిన విమానయాన రంగంలో స్థిరపడ్డాను. కాని, 2002లో జరిగిన ఓ సంఘటన నా జీవిత ప్రయాణాన్ని మలుపు తిప్పింది.

ఒకరోజు నా కళ్ళెదుట ఘోరమైన రోడ్డు ప్రమాదం జరిగి, ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దారిన వెళ్ళే ఏ ఒక్కరూ తక్షణ సహాయం అందించలేకపోయారు. ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదు. ఎలాగోలా అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగలిగినా, అక్కడ చికిత్స సౌకర్యాలు కొరవడడంతో ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అతని మరణంతో భార్యా బిడ్డలు రోడ్డున పడ్డారు. ఆ సంఘటన నన్నెంతో కదిలించింది. ఈ దేశంలో పేదవాడి జీవితం విలువ ఇంతేనా? అనే ఆలోచన నాలో మొదలైంది. సమాజాన్నీ, ప్రభుత్వాన్నీ చైతన్యవంతంచేసే కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచన కలిగింది. వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేసి అవగాహన కార్యక్రమాలను మొదలుపెట్టాను.

ఆ క్రమంలో 2007లో, రోడ్డు ప్రమాద బాధితుల కోసం 'దాస్ ఛారిటబుల్ ఫౌండేషన్'ను స్థాపించాను.

**నిర్భయలు ఎందరో...** 2012లో నిర్భయ గ్యాంగ్ రేప్ దేశవ్యాప్త ప్రకంపనలు సృష్టించిన సమయంలో, అదే తరహా బాధితులకు సమాన న్యాయం అందేలా కృషి చేశాను. ఒక్కో తీర్పుకోసం నెలల తరబడి బాధితులతో పాటు కోర్టుల చుట్టూ తిరిగాను. నిర్భయకు ప్రపంచం అండగా నిలబడింది. కానీ ఆమె లాంటి మరెంతో మంది బాధితుల తరపున పోరాడేదెవరు? వాళ్ళకు న్యాయం అందించగలమని ప్రమాణం చేయలేకపోయినా, వాళ్ళకు అండగా ఉంటామని ప్రమాణం చేయవచ్చు. నేను అదే చేశాను. అత్యాచార బాధితులు,వారి కుటుంబాలకు న్యాయం దక్కేలా సహాయపడడంతో పాటు, వాళ్ళకు పునరావాసం, భద్రత కల్పించడం కోసం 'పీపుల్ ఎగేనెస్ట్ రేప్ ఇన్ ఇండియా' (పిఎఆర్ఐ) సంస్థను స్థాపించాను.



నా 14 ఏళ్ల సేవా ప్రయాణంలో వందల మంది అభాగినులకు పరిహారం, న్యాయ సహాయం దక్కేలా తోడ్పడ్డాను. బాధితులకు సహాయం అందించడం కంటే, నేరాలను నియంత్రించడం ముఖ్యం. అలా చేయలేని పక్షంలో అనంతంగా ఈ నేరాలు కొనసాగుతూనే ఉంటాయి. కాబట్టి మహిళల మీద దాడులకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడినప్పుడే, మార్పు సాధ్యపడుతుంది".

–(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

ఎంతటి మహా ప్రవాహమైనా చిన్న నీటి ధారగానే మొదలవుతుంది

# కరెంటు అక్కర్లేని కూరగాయల మొబైల్ కూలర్!

మన దేశంలో చిన్న, సన్నకారు రైతులు 80 శాతానికి పైగా ఉంటారు. వీరు తమకున్న చిన్న కమతాల్లో పండించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను నిల్వ సదుపాయాలు లేక అదే రోజు అయినకాడికి అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతూ ఉంటారు. సాధారణ విద్యుత్తు లేదా సౌర విద్యుత్తు అవసరమయ్యే శీతల గదులను, శీతల సదుపాయం ఉన్న వాహనాలను ప్రభుత్వ సబ్సిడీపై సమకూర్చుకునే స్తోమత వీరికి ఉండదు. ఈ సమస్య పరిష్కారానికి ముగ్గురు యువ ఇంజనీర్లు నడుం బిగించటం విశేషం.


ఐఐటీ ముంబైలో ఇంజనీరింగ్ చదువుకున్న వికాస్ ఝా తో కూడిన ముగ్గురు ఇంజనీర్లు 'రుకార్ట్' పేరుతో ఏర్పాటు చేసిన తమ స్టార్టప్ సంస్థ ద్వారా చిన్న, సన్నకారు రైతుల బాధలు తీర్చే ఆవిష్కరణలను అందిస్తున్నారు. వీటిలో ముఖ్యమైనది 'కూరగాయల కూలర్' (సబ్జీ కూలర్). రెండేళ్ళ క్రితం తొలుత ఇటుకలతో స్థిరంగా నిర్మించే కూరగాయల కూలర్‌ను తయారుచేసిన 'రుకార్ట్' రైతులకు అందించింది. ఇటుకలతో నిర్మించే సబ్ జీ కూలర్‌ను ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పలువురు రైతులు వాడుతూ ప్రయోజనం పొందుతున్నారు. తాజాగా తరలించడానికి వీలయ్యే (మొబైల్ లేదా పోర్టబుల్) కూరగాయల కూలర్‌ను సైతం రూపొందించడం విశేషం.

**బరువు 50 కిలోలు... నిల్వ సామర్థ్యం 100 కిలోలు...**

తరలించడానికి వీలయ్యే కూరగాయల కూలర్ (మొబైల్ సబ్జీ కూలర్) కు చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే చాలా ప్రత్యేకతలున్నాయి.

దీని బరువు 50 కిలోలే. ఇద్దరు మనుషులు పైకి ఎత్తి పెట్టడానికి అనువుగా ఉంటుంది.

ఒక స్థలంలో ఇటుకలతో నిర్మించే సబ్జీ కూలర్ మాదిరిగా కాకుండా దీని విడిభాగాలను కొరియర్ ద్వారా తెప్పించుకొని ఎవరికి వారు స్వయంగా బిగించుకోవచ్చు. ప్రస్తుతం అవసరం లేదు అనుకుంటే ఏ భాగానికి ఆ భాగాన్ని విప్పదీసి జాగ్రత్త చేసుకోవచ్చు. మళ్లీ అవసరమైనప్పుడు తిరిగి అసెంబుల్ చేసుకొని వాడుకోవచ్చు.



మొబైల్ సబ్జీ కూలర్ 6 కాంపోజిట్ పానెల్స్ ఉంటాయి. (4 నిలువు, 2 అడ్డం). లోతైన పరిశోధనల అనంతరం ...5 లోహాల మిశ్రమంతో ప్రత్యేకంగా తయారైనవి ఈ పానెల్స్ ఎటువంటి విద్యుత్ అవసరం లేకుండా చల్లదనాన్ని అందించే విధంగా ఈ పానెల్స్‌ను విలక్షణంగా ఉత్పత్తి చేశారు. ఎటువంటి విద్యుత్తూ అవసరం లేదు. పానెల్స్ లోని ఖాళీలో రోజూ కొన్ని లీటర్ల నీరు పోస్తే చాలు.

ఇందులో 5-20 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. కాబట్టి 4-6 రోజుల పాటు అధిక పెట్టుబడితో కూడిన కోల్డ్ స్టోరేజ్ వాహనాన్ని సమకూర్చుకోవడానికి బదులు... మొబైల్ కూరగాయల కూలర్‌ను వాడుకోవచ్చు. కూరగాయలు / పూలు / పండ్లను తరలించే సాధారణ వాహనంలో మొబైల్ కూరగాయల కూలర్‌ను పెట్టుకుని అందులో ఉత్పత్తులను నిక్షేపంగా నిల్వ చేసుకోవచ్చు. దూర ప్రాంతాలకు తరలించవచ్చు.

మొబైల్ సబ్జీ కూలర్ ధర జీఎస్టీతో కలిపి 47,200 ప్యాకింగ్, రవాణా ఖర్చులు అదనం. నిర్వహణ ఖర్చు అతిస్వల్పం. ఐదేళ్ల పాటు పని చేస్తుంది. 7-9 నెలల్లోనే రైతుకు ఈ ఖర్చు వచ్చేస్తుంది. కూరగాయలు, పండ్ల రైతుల ఆదాయం 30 శాతం పెరిగిందని రుకార్ట్ వ్యవస్థాపకుడు వికాస్ ఝా తెలిపారు. ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణలో 252 మంది రైతులు వీటిని వాడుతున్నారు. వివరాలకు... వికాస్ ఝా -88790 49787. ■

# రైతు కంట కన్నీరుపెట్టిస్తున్న కంది పంట

**కం**ది ఆశలు గల్లంతు అవుతున్నాయి. ఎన్నో ఆశలతో కష్టపడి సాగు చేసిన పంట దిగుబడి లేకుండా పోయింది. ఫలితంగా రైతు ఆశలు ఆవిరవుతున్నాయి. అసలే వేరుశనగ వర్షాల కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. ఇక కంది పంటైనా కొంత ఊరట ఇస్తుందనుకుంటే అదికూడా చేతి కందకుండా పోయింది. కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల వ్యవసాయాధికారులు చేపట్టిన పంటకోత ప్రయోగాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆనంతపురం మండలంలోని కొడిమి, మన్నీల ఉప్పరపల్లి, ఇటుకలపల్లి తదితర గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. ఇందులో ఎకరాకు అర క్వింటా నుంచి క్వింటా లోపు దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. అయితే వారి ఆశలు ఆవిరవుతున్నాయి.

**పెరిగిన సాగు ...**

గత ఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడంతో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈయేడు పంటను 5,900 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఇక



కంది పంటను 3,548 హెక్టార్లలో సాగు చేశారు. అయితే ఈ ఏడాది వేరుశనగ కంటే కంది పంట సాగుకు రైతులు ఎక్కువగానే మక్కువ చూపారు. అందుకు అనుగుణంగా పంట సాగైంది. గత ఏడాది కంటే రెట్టింపు స్థాయిలో చేశారు. 7,669 హెక్టార్లలో సాగు చేశారు. మొదట్లో బాగానే కనిపించడంతో రైతుల్లో ఆశలు రేకెత్తాయి. అయితే నవంబరులో కురిసిన అధిక వర్షాలు కంది పంటను దెబ్బ తీశాయి. దీంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఇక గత ఏడాది కంది మద్దతు ధర రూ.6 వేలు ఉండగా ఈయేడు రూ. 6,300లకు పెరిగింది. బహిరంగ మార్కెట్లో రూ. 4 వేల నుంచి రూ.4,500 మధ్య కొనుగోలు జరుగుతోంది. ఈక్రమంలోనే చేతికొచ్చిన పంటనైనా ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుందామంటే ఆ పరిస్థితీ లేకుండా పోయింది. సంబంధిత అధికారులు కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్తోనే సరిపెడుతున్నారు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్ ధరకు విక్రయించి నష్టపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

**ఆదాయం లేదు**

మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. పెట్టుబడులు, మందులు ఇతరత్ర వాటికి రూ.40 వేలకు పైగా పెట్టుబడులు అయ్యాయి. మొదట్లో బాగుండేది. చేతికొచ్చేసరికి పెట్టుబడుల్లో సగం కూడా దక్కే పరిస్థితి లేకుండా పోయింది. గత ఏడాది వేరుశనగ సాగు లక్ష రూపాయలు నష్టపోయా. నష్టపోవడం తప్ప, ఆదాయం చూసింది లేదు.

– *లింగమయ్య కొడిమి*

**గొర్రెలకు వదిలేశా..**

పది ఎకరాల్లో దాదాపు రూ.80 వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశాను. పంట పూర్తిగా దెబ్బతిని దిగుబడి లేకుండా పోయింది. దీంతో పంట మొత్తాన్ని గొర్రెల మేతకు వదిలేశారు. రైతులు నష్టపోయేదే తప్ప లాభపడిలేదు.

– *రాధాకృష్ణ నర్సనేకుంట*

**20 మంది రిజిస్ట్రేషన్**

అధిక వర్షం కారణంగా మండలంలో కంది పంట చాలా వరకు దెబ్బతింది. ఇప్పటివరకు మండలంలో 20 మంది రైతులు కంది కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారుల అనుమతులు రాగానే కొనుగోలు చేస్తాం.

– *వెంకటేశ్వరప్రసాద్ ఏఓ*

■

# ప్రకాశం జిల్లాలో చేపల చెరువుల చెలగాటం

**జి**ల్లాలో చేపల చెరువుల తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. నదులు, జలాశయాలు, చెరువులకు సమీపంలో వేలాది ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపల పెంపకం జరుగుతోంది. నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించకపోవడంతో నీటి వనరుల కలుషితమవుతున్నాయి. కొరిశపాడు మండలం అనమనమూరులో 150 ఎకరాలు, మణికేశ్వరం 100 ఎకరాలు, భవనాసి రిజర్వాయర్ పక్కన చక్రాయపాలెం వద్ద 30 ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి అను మతులు తీసుకోకుండా తవ్వారు. వీటిలో అత్యధికం భవనాసి చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసినవే. వాటిలో సంప్రదాయ ఆహారం వేయకుండా కోళ్ల వ్యర్థాలతో చేపలు పెంచుతున్నారు. ఆ నీటిని చెంతనే ఉన్న గుండకమ్మ నదిలోకి వదులుతున్నారు. దీంతో ఒంగోలు పట్టణంతో పాటు 140 గ్రామాలకు తాగునీటిని అందించే గుండ్లకమ్మ జలాశయం కలుషితమవుతోంది. రామతీర్థం జలాశయం వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. మిగిలిన ప్రాంతాల్లోనూ జలవనరులు కలుషితమవు తున్నాయి. ఆ నీటిని తాగుతున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



**రిజర్వాయర్‌ల పక్కన అక్రమంగా చెరువుల తవ్వకం**

గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు భూములు, రామతీర్థం రిజర్వాయర్ ఒడ్డునే సుమారు 100 ఎకరాలు కొందరు అక్రమంగా చెరువులను తవ్వి చేపలు పెంచుతున్నారు. అక్కడి భూ యజమానులు అనేకమంది ప్రభుత్వం ఇచ్చిన పరిహారం తీసుకుని భూములను ఇరిగేషన్ శాఖకు గతంలోనే అప్పగించారు. అప్పట్లో ఎకరానికి రూ.12 లక్షలు పరిహారం పొందిన కొంతమంది ఇంకా అదనపు పరిహారం కావా లంటూ కోర్టును ఆశ్రయించారు. దీన్ని అడ్డుగా పెట్టుకొని కొందరు చేపల చెరువుల నిర్వాహకులు ఆట సాగిస్తున్నారు. ఎవరైనా అధికారులు వచ్చినప్పుడు విషయం కోర్టులో ఉన్నట్లు బుకాయిస్తున్నారు. కోర్టులో ఉన్నది అదనపు పరిహారం కోసం మాత్రమే చెరువులకు ఎటువంటి సంబంధం లేదు. కానీ కోర్టుకు వెళ్లిన వారితోపాటు వెళ్లని వారు కూడా అదేసాకు చూపుతూ చేపలను పెంచుతున్నారు.

**చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాల సేకరణ**

జిల్లావ్యాప్తంగా చికెన్ దుకాణాల నుంచి కొందరు వ్యక్తులు ప్రతి రోజూ వ్యర్థాలను సేకరిస్తున్నారు. అందుకోసం ఏడాదికి ఒకసారి కొంత మొత్తం చెల్లిస్తున్నారు. వ్యర్థాలను ఆటోల్లో తరలించి చేపల చెరువుల పెంపకందారులకు అమ్ముకుంటున్నారు. డ్రమ్ముకు రూ.1500 వసూలు చేస్తున్నారు. ఒంగోలు, టంగుటూరు, మార్కాపురం, సింగరాయకొండ, చీరాల, కందుకూరు, అద్దంకి, మార్టూరుతోపాటు జిల్లాలోని అన్ని పట్టణాల నుంచి ఈ వ్యర్థాలను సేకరించే ఆటోలు ఉన్నాయి.

**చోద్యం చూస్తున్న అధికారులు**

చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేయకూడదు. కానీ అందుకు విరుద్ధంగా చేపల పెంపకం జరుగుతోంది. మత్స్య శాఖ అధికారులకు మామూళ్లు ముట్టడంతో మిన్నకుంటు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కూడా తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తూ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు.

ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా చెరువుల్లో చేపలు పెంచుతూ ప్రజారోగ్యంగో చెలగాటం ఆడుతున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ■

చరిత్ర సృష్టించిన వారంటే ఓడిపోని వారనికాదు, ఓటమితో ఆగక గెలుపు అంతు చూసిన వాళ్ళు

# చేపల పెంపకం ... కొన్ని సూచనలు ...

**చే**ప పిల్లలను చెరువులు, కుంటల్లో వదిలే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. లేకుంటే, చేప పిల్లలు మృత్యువాత పడి, మత్స్యకారులు, రైతులు నష్టపోవాల్సి వస్తుంది.

- తగిన పరిమాణంలో ఉండే చేప పిల్లలనే విత్తనాలుగా ఎంచుకోవాలి. కొత్త ఆవాసానికి అలవాటు పడేలా, వాటికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలి. ఆ తర్వాతే చెరువులు, కుంటల్లో వదలాలి.
- చేప పిల్లల సైజు, సంఖ్యపైనే దిగుబడి ఆధారపడి ఉంటుంది.
- వ్యాపారం కోసం తవ్వించిన చేపల చెరువుల్లో 100 మి.మీ.కు పైగా పరిమాణం ఉన్న చేప పిల్లలనే వదలాలి.
- అంతకన్నా తక్కువ సైజు చేపలను వదిలితే, అవి చనిపోయే ప్రమాదం ఉంటుంది.
- 'పాలీ కల్చర్'ను అనుసరించే చెరువులు, కుంటల్లో 50 నుంచి 100 గ్రాముల సైజు చేపలను వదలడం మంచిది. ఈ సైజు చేప పిల్లల్లో 90% వరకు బతుకుతాయి. ఎదుగుదల కూడా బాగుంటుంది.
- కార్ప్ పాలీ కల్చర్ విధానంలో సాధారణంగా, ఒక హెక్టారు విస్తీర్ణముండే చెరువులో 5 వేల చేప విత్తనాలను వదులుతారు. దీని ద్వారా, ఏడాదికి 3–5 టన్నుల దిగుబడి వస్తుంది.ఏడాదికి 5–8 టన్నుల దిగుబడికోసం 8 వేల నుంచి 10 వేల చేప పిల్లల్ని వదలాల్సి ఉంటుంది. 10–15 టన్నుల దిగుబడి రావాలంటే, 15 వేల నుంచి 25 వేలు అవసరం అవుతాయి.
- అయితే, ఒకే రకం చేప పిల్లలను వదలడం వల్ల ఆహారం విషయంలో పోటీ ఏర్పడుతుంది. దీనిని నివారించేందుకు వివిధ జాతుల చేప పిల్లలను తగిన నిష్పత్తిలో వదలాల్సి ఉంటుంది.
- ఇందుకోసం చెరువులోని ఉపరితలం, మధ్య భాగం, అడుగున జీవించే రకాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- మన దేశంలో 'కార్ప్ పాలీ కల్చర్' పెంపకం కోసం కట్ల, సిల్వర్ కార్ప్, రవ్వ(రోహు), గ్రాస్ కార్ప్, మృగాల్, కామన్ కార్ప్ జాతులను కలగలిపి పెంచడం ఆచరణీయమైనదని రుజువైంది. అయితే, వీటిలో ఏయే జాతుల మిశ్రమాన్ని ఉపయోగించాలనేది వాటి లభ్యతను బట్టి, మార్కెట్‌లో ఉండే డిమాండ్‌ను బట్టి నిర్ణయించుకోవాలి.



- ఈ ఆరు జాతుల్లో.. కట్ల, సిల్వర్ కార్ప్ చెరువునీటి పైభాగంలోని (ఉపరితల) ఆహారాన్ని తినేవి. రవ్వ (రోహు) జాతి చేపలు, చెరువులో నిలువుగా పెరిగే ఆహారాన్ని తీసుకుంటాయి. ఇక గ్రాస్ కార్ప్ ఎక్కువగా చెరువులోని గడ్డి, ఆకులు, అలముల మీదే ఆధారపడే రకం. మృగాల్, కామన్ కార్ప్ జాతిచేపలు చెరువు అడుగుభాగంలోని ఆహారాన్ని స్వీకరిస్తాయి.
- దిగుబడితోపాటు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఉపరితల జీవులైన కట్ల, సిల్వర్ కార్ప్ రకాలను 30–40%, మధ్యభాగానికి చెందిన రవ్వ, గ్రాస్ కార్ప్ రకాలను 30–35%, అడుగుభాగంలోని ఆహారంపై ఆధారపడే మృగాల్, కామన్ కార్ప్ రకాలను 30–40%గా పెంచడం మంచిది. ■

సమస్య అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు , పరిష్కారాన్ని కనుక్కోలేకపోవడమే సమస్య

# పశువులకు గడ్డితోపాటు పౌష్టికాహారం!

పల్లె రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలోనూ, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడంలోనూ పాడి పరిశ్రమ కీలకంగా వ్యవహరిస్తున్నది. అయితే, పెరుగుతున్న కాలుష్యం మనుషులతోపాటు పశువుల్లోనూ పలురకాల వ్యాధులకు కారణం అవుతున్నది. ఈ క్రమంలో పశువుల పెంపకం, వాటి ఆరోగ్యం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. మనుషులకే కాదు.. పశువులకూ పౌష్టిక ఆహారం తప్పనిసరి. అందుకే, పోషక విలువలున్న గడ్డితో పాటు ఔషధ గుణాలుండే కొన్ని రకాల దినుసులనూ జీవాల ఆహారంలో చేర్చాలి. అప్పుడే వాటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందుకోసం ప్రకృతిలో లభించే సకల పోషక విలువలు, ఔషధ గుణాలు కలిగిన 'హెర్బల్ మిక్సర్'ను తయారు చేసుకోవాలి.



**హెర్బల్ మిక్సర్ తయారీ విధానం..**

**కావలసిన పదార్థాలు :**

ఉలువలు : 1.5 కిలోలు, తాటి బెల్లం : 1.5 కిలోలు, యాలకులు : 50 గ్రా., లవంగాలు : 100 గ్రా., సొంఠి : 200 గ్రా., మిరియాలు : 150 గ్రా., తోక మిరియాలు : 50 గ్రాములు, పిప్పళ్లు : 50 గ్రా., వాము : 200 గ్రా., పాల ఇంగువ : 100 గ్రా., వెల్లుల్లి : 300 గ్రా., మెంతులు : 150 గ్రా., మోదుగు పువ్వు : 300 గ్రా, దాల్చిన చెక్క : 50 గ్రా., నల్ల నువ్వులు లేదా వేరు పిసరాకు : 1.5 గ్రా.

**తయారీ విధానం :**

పైన చెప్పిన దినుసులన్నిటినీ మెత్తగా దంచుకోవాలి. ఈ మిశ్రమానికి ఒక లీటర్ దాకా ఆవ నూనె కలుపుకొని తడి తగలకుండా డబ్బాలో నింపుకోవాలి. దీనికి ఎండవేడి తగలకుండా ఉంచితే, రెండు నెలల పాటు నిల్వ ఉంటుంది. ఈ హెర్బల్ మిక్సర్‌ను పశువులకు నెలలో 15 రోజులు వాడితే సరిపోతుంది. పాలిచ్చే పశువులకు రోజుకు 50 గ్రాముల చొప్పున తినిపించాలి. రెండు నెలలు దాటిన దూడలకు వయసును బట్టి 5 గ్రా. నుంచి 20 గ్రా. మోతాదులో తినిపించాలి. దీనివల్ల పశువుల్లో జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. వాటిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అప్పుడే సీజనల్‌గా వచ్చే పలు రకాల వ్యాధులను సమర్థంగా తట్టుకొంటాయి.

*(నమస్తే తెలంగాణా సౌజన్యంతో)* ■

## సబ్సిడీపై పశుదాణా సరఫరా

దాదాపు రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై దాణాను అందిస్తోంది. 790 మెట్రిక్ టన్నులు కావాలని పశుపోషకులు కోరగా, ఇందులో ఇప్పటికే 480 మెట్రిక్ టన్నులను పంపిణీ చేశామని పశు సంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే అందిస్తామంటున్నారు. గతంలోనే ప్రభుత్వం అనంతపురం జిల్లాకు 1000 టన్నుల దాణామృతాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దాణామృతం కావాల్సిన పాడి రైతులు ఆర్‌బీకే ల్లోని కియోస్క్‌ల ద్వారా ఇండెంట్ పెట్టుకోవాల్సి ఉంటుంది.

**గరిష్ఠంగా 1,800 కేజీలు...**

ఒక్కో పాడి రైతుకు గరిష్ఠంగా 1800 కేజీల వరకు దాణామృతాన్ని ఇస్తారు. సబ్సిడీ పోను కిలోకు కేవలం రూ.6.50 చెల్లిస్తే సరిపోతుంది. కనీసం 200 కేజీలకు ఒక్కో రైతు ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. పాల దిగుబడులను పెంచుకోవడం కోసం పోషకాలతో కూడిన దాణాను పశువులకు అందించడం అవసరమని అధికారులు చెబుతున్నారు. ■

**విజేతల జీవితాలు సందేశాన్ని అందిస్తే, పరాజితుల జీవితాలు పరిష్కారాన్ని చూపుతాయి**

# ఆంధ్ర మహిళల అసామాన్య స్వాతంత్ర్య స్ఫూర్తి, సాహితీ దీప్తి !

పుస్తక సమీక్ష



డాక్టర్ కనకదుర్గ
(9491140299)

చరిత్ర ... మానవసమాజ ప్రగతి గమనానికి కీలక ఇంధనం! గతకాలపు నిలువుటద్దంలో సత్య దర్శనం చేయించి, భవ్యమైన భవిష్యత్‌కోసం వర్తమానాన్ని ఎలా మలచుకోవాలో పాఠాలు నేర్పి, ప్రేరణ కలిగించి, కర్తవ్యోపదేశం చేసే హిత కారిణి అది. నిజం నిప్పులాంటిదే అయినా నివురు కప్పుకోవడం సహజ పరిణామం. దానితోపాటు ఆ నిజం చుట్టూ ఎన్నెన్నో పొరలు, తెరలు, కలబోతలు, కల్పనలు! ఎంతటి వైభవోజ్వల చరిత్రకైనాపట్టే దుర్గతి యిది. ఇక చారిత్రక దృష్టి అంతగా అలవడకనో, 'అతి పరిచయాత్ అవజ్ఞ' అన్నట్టుగానో (మనకు బాగా తెలిసిన విషయమైనప్పుడు, ఆ ... ఇదేముందిలే ...అనే చులకన భావం వల్లనో) వెలుగుకు నోచుకోక అజ్ఞాతంగా, అగోచరంగా మగ్గిపోయే చారిత్రక మహోన్నత ఘట్టాలు ఎన్నెన్నో! ఐతే, కాంతి కిరణాల ప్రసారం వరకే చీకటి సయ్యాట! 'రవిగాననిచో కవిగాంచునే కదా!' అన్నారు. అదేవిధంగా, క్రాంతి దర్శన నిపుణమైన పరిశోధక నేత్రాలు 'ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని' గాధలను తవ్వితీసి మన కట్టెదుట నిలుపుతాయి.

ఆ కోవకు చెందిన ఒక ఆణిముత్యం ఇటీవల అక్షరబద్ధమై వెలుగుచూసిన ఆంధ్ర నారీమణుల వ్యక్తిగత, సమాజహిత, స్వాతంత్ర్యాకాంక్షా ప్రేరిత ఘన సాహితీ చరిత్ర పుస్తకరూపం. విశ్రాంత ప్రధాన అధ్యాపకురాలు, తెలుగు సాహితీవేత్త డాక్టర్ జంధ్యాల కనకదుర్గ 'స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి' శీర్షికతో వెలువరచిన ఈ గ్రంథం క్రీస్తుశకం 1900 నుంచి 1947 వరకు దాదాపు అర్ధశతాబ్దం పాటు తెలుగునేలపై ఎందరో మహిళామణులు కలాలు సంధించి, గళాలు సవరించి అటు మహిళలను,ఇటు మొత్తం సమాజాన్ని తట్టి లేపిన వైతాళిక సాహితీ వైభవం! కనకదుర్గ నిశిత పరిశీలనా దృష్టికి, అవిశ్రాంత కృషికి, మహిళాసాధికారత మహదాశయ సాధన తత్పరతకు ఈ పుస్తకం నిలువెత్తు దర్పణం.

తెలుగుగడ్డపై వెలుగులీనిన మహిళామణుల గాధలెన్నో ఇంతకు పూర్వం గ్రంథస్తం కాకపోలేదు. మన వ్యావహారిక కాలమానం మూడవ సహస్రాబ్దిలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, రెండవ సహస్రాబ్ది చివరి శతాబ్దంలో, అంటే 1900 నుంచి 2000 సంవత్సరం వరకు చరిత్రలో నిలిచిపోయే కృషిచేసిన 118 మంది ఆంధ్ర మహిళామణుల పరిచయాలతో ప్రముఖ మహిళా ఉద్యమకారిణులు ఓల్గా, వసంత కన్నాబిరాన్, కల్పనా కన్నాబిరాన్ యిటు తెలుగులోనూ, అటు ఆంగ్లం లోనూ కలగలిపి రూపొందించిన 'మహిళావరణం' ఈ కోవకు చెందిన ఒక మణిదీపం.

కనకదుర్గ వెలువరించిన ప్రస్తుత సమీక్షా గ్రంథం ఆ కృషిని మరింత ముందుకు తీసుకు వెడుతూ, మహిళా సాధికారతకు బాటలువేసే తమ స్వతంత్ర భావాలతో, దేశ స్వాతంత్ర్య పిపాసతో, త్యాగ నిరతితో, వెలుగుదివ్వెలుగా నిలిచే రచనలతో, ఉపన్యాసాలతో, నవచరిత్రకు సూత్రధారులైన మరెందరో తెలుగు వనితల సాహస గాధలను, సాహితీ విన్యాసాలను వెదికివెదికి పట్టుకుని మన ముందు ఉంచడంలో సఫలీకృతమైంది. వీరిలో లబ్ధప్రతిష్ఠులతో పాటు, అజ్ఞాతంగా వుండిపోయిన వారెందరో వున్నారు. ఉపన్యాసాలు, కథలు, గల్పికలు, నాటకాలు, కవితలు, కీర్తనలు, లేఖలు, వ్యాసాలు, స్వీయ చరిత్రలు, శతకాలు, నవలలు, పాటలు శీర్షికల కింద వర్గీకృతమైన 800కు పైగా సాహితీ మయూఖాలు మనలను ఉద్వేగానికి గురి చేస్తాయి. ఆపై అనల్పమైన త్యాగ నిరతితో దేశ స్వాతంత్ర్యంకోసం ధన కనక వస్తు వాహనాలను సమర్పించడమే కాకుండా 300 మందికిపైగా సోదరీమణులు కారాగారవాసాన్ని కూడా అనుభవించారని తెలిసి మనసు ప్రణమిల్లుతుంది. నిజానికి విశ్వవిద్యాలయాలో, అకాడెమీలో, ఏవైనా భాషా సాహితీ పరమైన ఇతర ప్రభుత్వ సంస్థలో పూనికతో చేయవలసినంతటి విస్తృత కృషి యిది. అయినా, కనకదుర్గ అమోఘమైన సంకల్పంతో యింతటి అమూల్యమైన సమాచారాన్ని ఒంటరిగా మనకు అందించగలిగారంటే ఆశ్చర్యం వేస్తుంది. 'జంకదు' చిరు (బిరుద) నామంతో సుపరిచితురాలైన కనకదుర్గ ఎంతటి 'కృషి రాక్షసి' అని అబ్బురపరుస్తుంది ఈ పుస్తకం. అన్ని ఉన్నత విద్యాపీఠాలలో, సాహితీ సంస్థలలో తప్పక వుండదగిన గ్రంథమిది. ఇంత చక్కటి కానుకను సమాజానికి అందించిన నా సహాధ్యాయిని మనసారా అభినందిస్తూ ...

**– జె.వి.క్రిష్ణమూర్తి**

**అతిగా ఆలోచించడమే అంతులేని అసంతృప్తికి, ఆందోళనకు మూలం**

## వాళ్ళ ఇంటి లోపల ఎవరైనా టాయిలెట్ నిర్మించవచ్చు ప్రభుత్వ సబ్సిడీ మరియు రుణ సహాయంతో

- మరుగుదొడ్డిని నిర్మించుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీ పొందండి
- ఎస్‌హెచ్‌జిలు/బ్యాంకులు/నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందండి
- మరింత సమాచారం కోసం, పంచాయతీ అధికారి/ప్రభుత్వ అధికారి/ఎన్‌జీఓను సంప్రదించండి



## పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, సంతోషకరమైన గ్రామం

- మరుగుదొడ్డి ఉపయోగించడం సౌలభ్యంగా ఉంటుంది
- పిల్లలు మరియు మహిళలకు భయం మరియు సిగ్గుపడవలసిన అవసరం లేదు
- వ్యాధుల వ్యాప్తిని నివారించండి
- పిల్లల చదువు లేదా కుటుంబ ఆదాయం ప్రతికూలంగా ప్రభావితం కావు

- రెండు గుంతల నిర్మించండి
- నీటి కనెక్షన్ ఇన్‌స్టల్ చేయండి
- సులభ లోన్ పొందండి
- మీ కుటుంబాన్ని సంతోషపెట్టండి



नाबार्ड



नाबार्ड

# స్వచ్ఛత ఉద్యమం



రోజూ మరుగుదొడ్డి ఉపయోగించండి
మీ కుటుంబంలో ఆరోగ్యం మరియు సంతోషం నింపండి



అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి

## బహిర్భూమికి వెళ్ళడం అంటే మీ ఇబ్బందులను పెంచుకోవడమే:



జబ్బులు- అతిసారం, నీళ్ళ విరేచనాలు, కరోనా వైరస్ ఇన్ఫెక్షన్.



కాలుష్యం- భూమి కాలుష్యం, నీటి కాలుష్యం



మహిళలకు భయం మరియు సిగ్గు

## ఇంట్లో మరుగుదొడ్డి ఉండగా బహిర్భూమికి ఎందుకు వెళ్ళాలి?



నీటి కనెక్షన్ లేదా?



మరుగుదొడ్డి గుంత నిండిపోయిందా?



మరుగుదొడ్డికి మరమ్మతులు అవసరమా?

## పరిష్కారాలు సులభమమైనవి:



మీ మరుగుదొడ్డి నీటి కనెక్షన్ పొందండి



మా మరుగుదొడ్డి జత గుంతలు నిర్మించుకోండి



అవసరమైతే మీ మరుగుదొడ్డి రెండు గుంతల మరుగుదొడ్డి నిర్మించండి



నీటి సదుపాయం కల్పించండి

MAHILA SADHIKARATHA
Publication Date: 01-03-2022 ; Posting Date: 05 & 06-03-2022

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23





అనంత గ్రామీణ మహిళా ఎఫ్ పి ఓ , ఆజీవ ఎఫ్ పి ఓ , ధీశాలి ఎఫ్ పి ఓ పాలకవర్గాల సమావేశాల దృశ్యాలు






భూమాత ఎఫ్ పి ఓ పాలకవర్గ సమావేశం ... అనంతపురం జిల్లా ఎఫ్ పి ఓల ... యాదాద్రి ఎఫ్ పి ఓల ప్రతినిధులకు శిక్షణ





గార్లదిన్నెలో వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ ....
మర్యాదరామన్న పట్నం ఎఫ్ పి ఓ నూతన కార్యాలయ ప్రారంభం ... ఫిబ్‌సాల్ ఉత్పత్తుల ప్రదర్శన





సందర్శన పర్యటనలో క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్ రైతులు ... చంద్రుగొండలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

To ADDRESS





ఏ బి వై సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089